తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
గురువారం
08 అక్టోబర్ 2026

# చిన్న రోడ్డుపై భారీ వాహనాల బీభత్సం!






- గుంతలమయంగా మారిన గుమ్మడిదల-కానుకుంట రహదారి
- రాత్రివేళ లైటింగ్ లేక ప్రమాదాలు.. ప్రమాదకర మలుపులతో మరింత ముప్పు
- లారీలు, టిప్పర్ల రాకపోకలతో దుమ్ము.. దూళి
- రహదారి విస్తరణ కోసం యువత రాస్తారోకో, ధర్నాలు
- శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజల డిమాండ్

**గుమ్మడిదల, అక్టోబర్ 7 (జనంసాక్షి):** గుమ్మడిదల–కానుకుంట రహదారి అధ్వానంగా మారడంతో ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకవైపు పరిశ్రమల కార్యకలాపాలు పెరుగుతుండగా, మరోవైపు పరిశ్రమలకు సంబంధించిన లారీలు, టిప్పర్లు నిత్యం ఈ రహదారిపై రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో రహదారి గుంతలమయంగా మారడంతో పాటు రాత్రివేళ సరైన లైటింగ్ లేకపోవడం, ప్రమాదకర మలుపులు ఉండటంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అడుగడుగునా గుంతలే...**

గుమ్మడిదల నుంచి కానుకుంట వైపు వెళ్లే రహదారిపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. గుంతలను తప్పించుకునేందుకు వాహనదారులు రోడ్డుకు ఒక వైపు నుంచి మరోవైపుకు వెళ్లాల్సి వస్తోంది. అదే సమయంలో ఎదురుగా భారీ వాహనాలు రావడంతో ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**రాత్రివేళ లైటింగ్ లేక ఇబ్బందులు...**

రహదారిపై రాత్రివేళ సరైన వీధి దీపాల సౌకర్యం లేకపోవడం వాహనదారులకు ప్రాణసంకటంగా మారుతోంది. గుంతలు కనిపించకపోవడంతో పాటు ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనదారులు భయంతో ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రమాదకర మలుపులు.. పొంచి ఉన్న ముప్పు...**

ఈ మార్గంలో ఉన్న పలు మలుపులు కూడా ప్రమాదాలకు కారణంగా మారుతున్నాయి. మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు ముందుగా కనిపించకపోవడంతో లారీలు, టిప్పర్లు, ద్విచక్ర వాహనాలు ఢీకొనే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. రహదారి విస్తరణతో పాటు ప్రమాదకర మలుపుల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

**భారీ వాహనాలతో మరింత దెబ్బ...**

పరిశ్రమలు పెరగడంతో ఈ మార్గంలో భారీ వాహనాల రాకపోకలు గణనీయంగా పెరిగాయి. రహదారి సామర్థ్యానికి మించి లారీలు, టిప్పర్లు తిరుగుతున్నప్పటికీ అందుకు అనుగుణంగా రహదారి విస్తరణ, బలోపేతం జరగడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. భారీ వాహనాల రాకపోకల కారణంగా రహదారి మరింత దెబ్బతింటోందని వారు పేర్కొంటున్నారు.

**వర్షం వస్తే గుంతలే కనిపించవు...**

వర్షం కురిసిన సమయంలో గుంతల్లో నీరు నిలిచి రహదారి పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది. గుంతలు కనిపించక వాహనదారులు అదుపు తప్పే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే ముప్పు ఉందని చెబుతున్నారు.

**ఐదు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు...**

ఈ రహదారిపై అనంతారం, కానుకుంట, రామ్‌రెడ్డి బావి, వీరారెడ్డిపల్లి, నాగిరెడ్డిగూడెం గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. రైతులు, విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగులు, ద్విచక్ర వాహనదారులు ఈ మార్గంపైనే ఆధారపడుతున్నారు. రహదారి అధ్వానంగా మారడంతో రోజువారీ ప్రయాణం ఇబ్బందికరంగా మారిందని గ్రామస్థులు తెలిపారు.

**దుమ్ము.. దూళి.. ప్రమాదం**

లారీలు, టిప్పర్ల రాకపోకలతో రహదారిపై దుమ్ము విపరీతంగా ఎగిసిపడుతోంది. దీంతో రోడ్డు పక్కన నివసించే ప్రజలు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంతలు, దుమ్ము, భారీ వాహనాలు, రాత్రివేళ లైటింగ్ లేకపోవడం కలిపి ఈ మార్గంలో ప్రయాణాన్ని ప్రమాదకరంగా మార్చాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



**రోడ్డెక్కిన యువత...**

రహదారి సమస్యను పరిష్కరించాలని కోరుతూ స్థానిక యువత పలుమార్లు రాస్తారోకో, ధర్నాలు నిర్వహించినా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని వారు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి రహదారి పరిస్థితిని పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని యువత, గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

**ప్రమాదం జరిగాకే మేల్కొంటారా?**

పరిశ్రమలు పెరుగుతున్నప్పటికీ వాటికి అనుగుణంగా రహదారి మౌలిక వసతులు అభివృద్ధి చెందడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కాకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గుమ్మడిదల–కానుకుంట రహదారిని అధికారులు వెంటనే పరిశీలించి గుంతలను పూడ్చడంతో పాటు పూర్తిస్థాయిలో పునర్నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు. భారీ వాహనాల రాకపోకలకు అనుగుణంగా రహదారిని విస్తరించాలని, ప్రమాదకర మలుపుల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని, రాత్రివేళ తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. నాణ్యమైన రహదారి నిర్మాణంతో పాటు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే స్పందించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

### ప్యూర్ కోల్డ్ ప్రెస్ ఆయిల్

## తయారీ కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించిన కలెక్టర్

**తెల్కపల్లి, అక్టోబర్ 7 (జనంసాక్షి):** మండల పరిధిలోని చిన్నముద్దునూరులో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, రైతు ఉత్పత్తిదారుల సంస్థ తెలకపల్లి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛమైన చల్లని పద్ధతి నూనెల తయారీ కేంద్రాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ శ్రీ హేమంత్ కేశవ్ పటేల్, ఐఏఎస్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. బుధవారం ఈ సందర్భంగా జిల్లా సహకార అధికారి శ్రీ రఘునాథరావు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, రైతు ఉత్పత్తిదారుల సంస్థ తెలకపల్లి చైర్మన్ శ్రీ డి. భాస్కర్ రెడ్డితో కలిసి కలెక్టర్ నూనెల తయారీ ప్రక్రియను పరిశీలించారు. తయారీ కేంద్రంలో వినియోగిస్తున్న ముడి సరుకు నాణ్యత, నూనె తయారీ విధానం, శుద్ధీకరణ, ప్యాకింగ్, విక్రయ ప్రక్రియలను పరిశీలించి సంబంధిత సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుల నుంచి సేకరించే నాణ్యమైన నూనె గింజలను స్థానికంగానే ప్రాసెస్ చేసి విలువ ఆధారిత ఉత్పత్తులుగా విక్రయించడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం కల్పించే అవకాశాలపై కలెక్టర్ ఆరా తీశారు. ప్రస్తుతం ఈ కేంద్రంలో పల్లీ నూనె, కుసుమ నూనె తదితర చల్లని పద్ధతిలో తయారుచేసిన నూనెలను ఉత్పత్తి చేసి విక్రయిస్తున్నారు. భవిష్యత్తులో మరిన్ని రకాల నూనెల ఉత్పత్తిని విస్తరించి రైతులకు మరింత ప్రయోజనం కల్పించే దిశగా సంస్థ చేపడుతున్న చర్యలపై కూడా కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. తయారీ కేంద్రం నిర్వహణ, ఉత్పత్తి విధానం, నాణ్యత, విక్రయాలు, రైతులకు కలుగుతున్న ప్రయోజనాలపై సంబంధిత సిబ్బందితో జిల్లా కలెక్టర్ చర్చించారు.





## మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధి పనులు ప్రారంభం

### దసరా కానుకగా ఎంటర్‌టైన్‌మెంట్ జోన్, చిల్డ్రన్స్ ప్లే ఏరియా ప్రారంభం





**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 07(జనంసాక్షి):** మహబూబ్‌నగర్ పట్టణంలోని పెద్ద చెరువు మినీ ట్యాంక్ బండ్‌పై మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ. 1.50 కోట్ల వ్యయంతో నిర్మించిన వాకింగ్ ట్రాక్, పిల్లల ఆటస్థలం, గ్రీన్ జోన్, సెల్ఫీ పాయింట్, బతుకమ్మ ఘాట్లను ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా బుధవారం ప్రారంభించారు. అదేవిధంగా శిల్పారామంలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల కోసం ప్రత్యేకంగా కేటాయించిన స్టాళ్లను కూడా వారు జాతికి అంకితం చేశారు.

**ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..** దసరా పండుగ సెలవుల నేపథ్యంలో పట్టణవాసులు, పిల్లలు కుటుంబసమేతంగా ఆహ్లాదంగా గడిపేందుకు ఈ వినోద, వ్యాయామ ప్రాంతాలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రజలు వాకింగ్, యోగా చేసుకోవడానికి ఈ ప్రదేశం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ట్యాంక్ బండ్ సుందరీకరణలో ఇది తొలి దశ మాత్రమేనని, రాబోయే రోజుల్లో పరిసర ప్రాంతాలను దశలవారీగా అభివృద్ధి చేసి మహబూబ్‌నగర్‌కు ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు.

అనంతరం ఈ సౌకర్యాలను ప్రజలు బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని, పరిశుభ్రతను పాటించాలని కోరారు. మొక్కల పరిరక్షణకు డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం కల్పించామని, పార్కు నిర్వహణకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ట్యాంక్ బండ్ వద్ద అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీసు గస్తీ, భద్రతా చర్యలు పెంచాలని సూచించారు.

*మిగతా 13లో..*

# కాంగ్రెస్‌తోనే ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం సాధ్యం

- తెలంగాణ వర్కింగ్ యూనియన్ ఆర్టిసి గెలిపే లక్ష్యంగా పనిచేస్తా
- టిపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత కిషన్
- కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటే బాణం గుర్తుకు ఓటెయ్యాలి
- అశ్వత్థామ రెడ్డి నాయకత్వాన్ని బలపరచాలి
- కాంగ్రెస్ అనుబంధ యూనియన్, తెలంగాణ వర్కింగ్ యూనియన్
- కార్మికులుగా ఉండొద్దు ఉద్యోగులుగా మారాలి
- తెలంగాణ ఆర్టీసీ వర్కింగ్ యూనియన్ గేట్ మీటింగ్





**సంగారెడ్డి, అక్టోబర్ 07 (జనంసాక్షి):** సంగారెడ్డి బస్‌డిపో ఎదుట తెలంగాణ ఆర్టీసీ వర్కింగ్ యూనియన్ (TWU) ఆధ్వర్యంలో బుధవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ నెల 9న జరగబోయే ఆర్టీసీ యూనియన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత కిషన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకత్వ ఆదేశాల మేరకు తెలంగాణ వర్కింగ్ యూనియన్‌కు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున, కార్మికులను పూర్తిస్థాయి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్మికుల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించాలంటే అశ్వత్థామరెడ్డి నాయకత్వాన్ని బలపరచాలని మరియు బాణం గుర్తుకు ఓటేసి తెలంగాణ వర్కింగ్ యూనియన్‌ను గెలిపించాలని ఆయన కోరారు. ఎన్నికలలో విజయం కోసం తనవంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఎస్‌డబ్ల్యూ, ఐఎన్‌టీయూసీ, ఎస్‌డబ్ల్యూఎఫ్, టీఎంయూ, టీడబ్ల్యూ యూలతో కూడిన ఐక్య కూటమి అభ్యర్థులను గెలిపించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ప్రతీ ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గంగేరి శ్రీహరి, మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనితా సంతోష్ కుమార్, సీఐటీయూ నాయకుడు జి. సాయిలు, టీడబ్ల్యూయూ యూనియన్ అధ్యక్షుడు పీరయ్య, కార్యదర్శి కృష్ణారెడ్డి, నాయకులు మరియు పెద్ద సంఖ్యలో ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

## వెంకటాపూర్‌లో సోఫిట్ నిర్మాణానికి స్థల పరిశీలన



**కోహిర్, అక్టోబర్ 7 (జనం సాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం వెంకటాపూర్‌లో బుధవారం అధికారులు సోఫిట్ (ఇకుడు గుంతల) నిర్మాణానికి స్థల పరిశీలన, మార్కింగ్ చేపట్టారు. గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచి, మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ఈ నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. సాంకేతిక సిబ్బంది సహాయంతో అనువైన స్థలాలను గుర్తించి మార్కింగ్ చేశారు. పనులను నిబంధనల ప్రకారం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఎంపీఓ, ఏపీవో, సర్పంచ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పాఠశాలలో సేవా కార్యక్రమం

- వేదజనని వేదిక ఆధ్వర్యంలో చేయూత



**కల్హేర్, అక్టోబర్ 08 (జనంసాక్షి):** కల్హేర్ మండలం మర్ది గ్రామంలోని శ్రీ వేద జనని వేదిక స్మార్త పీఠం (మెల్బోర్న్ & హైదరాబాద్) ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థిని భానుప్రియకు నెలకు సరిపడా నిత్యవసర వస్తువులను పంపిణీ చేశారు. తండ్రి లేక ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఈ కుటుంబానికి 11వ విడత సేవా కార్యక్రమంలో భాగంగా బియ్యం, నూనె, పప్పు ధాన్యాలను జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయుల చేతుల మీదుగా అందజేశారు. పేద విద్యార్థులను ఆదుకుంటున్న వేద జనని వేదిక ప్రతినిధులకు, చంద్రశేఖర్ ఆచార్యకు ఉపాధ్యాయులు, స్థానికులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సిద్ధాపూర్ తండాలో పశువులకు ఉచిత వైద్య శిబిరం



**కోహిర్, అక్టోబర్ 7 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహిర్ మండల పరిధిలోని సిద్ధాపూర్ తండాలో మహీంద్రా అండ్ మహీంద్రా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువైద్య సిబ్బంది గ్రామానికి చేరుకుని పశువులకు పరీక్షలు చేసి, అవసరమైన మందులు, ఇంజెక్షన్లు ఉచితంగా అందజేశారు. వ్యాధుల నివారణ, పోషకాహారం, పరిశుభ్రతపై రైతులకు అవగాహన కల్పించారు. సకాలంలో వైద్యం అందిస్తే పశువులు ఆరోగ్యంగా ఉండి పాల ఉత్పత్తి, ఆదాయం పెరుగుతాయని చెప్పారు. ఈ శిబిరానికి సిద్ధాపూర్ తండా, పరిసర ప్రాంతాల రైతులు విశేషంగా హాజరై సేవలు పొందారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి శిబిరాలు మరింత నిర్వహించాలని కోరుతూ, ఉచిత వైద్యం అందించిన మహీంద్రా సంస్థకు రైతులు ధన్యవాదాలు తెలిపారు.

## దాచారంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామసభ



**బెజ్జంకి, అక్టోబర్ 7 (జనం సాక్షి):** బెజ్జంకి మండలం దాచారం గ్రామంలో బుధవారం ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ గ్రామ సభ నిర్వహించారు. తనిఖీ అధికారి సురేందర్ హాజరై, పూర్తయిన పనుల రికార్డులను పరిశీలించి నిబంధనల ప్రకారమే పనులు జరిగినట్లు తెలిపారు. పారదర్శకతతో గ్రామాభివృద్ధికి మరిన్ని పనులు చేపడతామని సర్పంచ్ బైరా మానస రాజేందర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దీటి బాలనర్సు, కార్యదర్శి సురేష్, సాంకేతిక సహాయకురాలు మాధవి, వార్డు సభ్యులు, కూలీలు పాల్గొన్నారు.

## తుక్కాపూర్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం





**కొల్చారం, అక్టోబర్ 07(జనంసాక్షి):** కొల్చారం మండలంలోని తుక్కాపూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు, ఉప సర్పంచ్ ఆరే రవీందర్ ఆధ్వర్యంలో హైదరాబాద్ సింధు హాస్పిటల్ వారి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ పర్యవేక్షణలో గైనకాలజిస్ట్, కార్డియాలజిస్ట్ బృందం సర్పంచ్‌తో పాటు 134 మంది గ్రామస్తులకు బిపి, షుగర్, గుండె, క్యాన్సర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని సింధు హాస్పిటల్‌కు రెఫర్ చేశారు. తెల్ల రేషన్ కార్డు ఉన్నవారికి ఆసుపత్రి చైర్మన్ బండి పార్థ సారధి రెడ్డి సౌజన్యంతో ఆసుపత్రిలో ఉచిత చికిత్స అందిస్తామని తెలిపారు. శిబిరాన్ని విజయవంతం చేసిన వైద్యులను, సిబ్బందిని పాలకవర్గం అభినందించింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## తెల్లాపూర్‌లో బతుకమ్మ, దసరా వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు

- మాజీ చైర్మన్ మల్లేపల్లి సోమిరెడ్డి



**రామచంద్రపురం, అక్టోబర్ 7 (జనంసాక్షి):** తెల్లాపూర్ పరిధిలో బతుకమ్మ, విజయదశమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లేపల్లి సోమిరెడ్డి తెలిపారు. అక్టోబర్ 10న ఎంగిలిపూల బతుకమ్మ, 18న సద్దుల బతుకమ్మ, 20న విజయదశమి వేడుకలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వేడుకలు ప్రశాంతంగా సాగేలా తెల్లాపూర్ చెరువు వద్ద చేపడుతున్న ఏర్పాట్లను బిఆర్ఎస్ నాయకులు, యువకులతో కలిసి ఆయన పరిశీలించారు. మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా పరమేష్ ముదిరాజ్ ఎన్నిక



**నాగల్గిద్ద, అక్టోబర్ 07 (జనంసాక్షి):** నారాయణఖేడ్ నియోజకవర్గం టీయూడబ్ల్యూజే (H-143) టీఈయూజే ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా ఎన్నికైన పరమేష్ ముదిరాజ్‌ను మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షట్కర్ ఘనంగా సన్మానించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తూ, జర్నలిస్టుల సంక్షేమానికి పరమేష్ కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు హన్మంత్ రావ్ పాటిల్, మండలాధ్యక్షుడు జ్ఞానేశ్వర్ రెడ్డి, సర్పంచ్ సంగమేశ్వర్ పాటిల్, మీడియా ప్రతినిధులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## సాయి చరణ్ జన్మదిన వేడుకల్లో మున్సిపల్ చైర్మన్



**నాగల్గిద్ద, అక్టోబర్ 07 (జనం సాక్షి):** నారాయణఖేడ్ పట్టణ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గౌలి సాయిచరణ్ జన్మదిన వేడుకలు జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షట్కర్ స్వగృహంలో ఘనంగా జరిగాయి. నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షట్కర్ ముఖ్య అతిథిగా హాజరై, సాయి చరణ్‌తో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని సాయి చరణ్‌ను అభినందించారు.

## కల్హేర్‌లో వీధిరోడ్ల మరమ్మతులు



**కల్హేర్, అక్టోబర్ 07 (జనంసాక్షి):** కల్హేర్ మండల కేంద్రంలో పాడైన వీధి రోడ్లకు బుధవారం మొరం పోయడం జరిగింది. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోటి గంగారాం పాల్గొని రోడ్ల మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహేష్ మరియు రమేష్, పోచయ్య, కృష్ణ, తుకారాం, గోపాల్, గంగారాం, రాజు పంచాయతీ సభ్యులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అనాథ చిన్నారులకు నిత్యవసర సరుకుల పంపిణీ



**కల్హేర్, అక్టోబర్ 08 (జనంసాక్షి):** కల్హేర్ మండలం మర్ది గ్రామంలో బుధవారం శ్రీ వేద జనని వేదిక స్మార్త పీఠం (మెల్బోర్న్ & హైదరాబాద్) ఆధ్వర్యంలో అనాథ చిన్నారులకు నెలకు సరిపడా నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. నానమ్మ పెంపకంలో పెరుగుతున్న చిన్నారులు వీణ, చరణ్ సింగ్‌లకు బియ్యం, నూనె, పప్పు ధాన్యాలను అందజేశారు. 10వ విడత సేవా కార్యక్రమంలో భాగంగా ఈ సాయం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. నిరుపేద, అనాథ పిల్లలను ఆదుకోవడమే తమ ధ్యేయమని పేర్కొనగా, లబ్ధిదారులు వేద జనని వేదిక దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

## రాష్ట్ర స్థాయి ఖో-ఖో పోటీలకు కోహెడ గురుకుల విద్యార్థి ప్రణయ్



**కోహెడ, అక్టోబర్ 07 (జనంసాక్షి):** కోహెడ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల విద్యార్థి బి. ప్రణయ్ కరీంనగర్ బి.ఆర్. అంబేద్కర్ స్టేడియంలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి జూనియర్ ఖో–ఖో పోటీల్లో ప్రతిభ చాటాడు. ఈ నెల 15, 16 తేదీల్లో హైదరాబాద్ సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు అతడు ఎంపికయ్యాడని ప్రిన్సిపల్ జి. అన్నపూర్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన ప్రణయ్‌ను పిడి అరవింద్, పిఈటి ప్రవీణ్, ఉపాధ్యాయులు అభినందిస్తూ, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

## బెజ్జంకి మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా బొయిని ప్రశాంత్



**బెజ్జంకి, అక్టోబర్ 7(జనంసాక్షి):** బెజ్జంకి మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా గుగ్గిళ్ల గ్రామానికి చెందిన బొయిని ప్రశాంత్ నియమితులయ్యారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు తప్పెట శంకర్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ ఎస్సీ వర్గాల సమస్యల పరిష్కారానికి, మండలంలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా అధ్యక్షురాలు అంక్షారెడ్డి, మండల అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ మరియు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## పర్షపల్లిలో కాంగ్రెస్ గ్రామ కమిటీ ఏర్పాటు



**కోహీర్, అక్టోబరు 7 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహీర్ మండల పరిధిలోని పర్షపల్లిలో కాంగ్రెస్ గ్రామ కమిటీని బుధవారం ఏర్పాటు చేశారు. నూతన అధ్యక్షుడిగా సి.హెచ్. ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా సి. నాగరాజు, ప్రధాన కార్యదర్శులుగా నర్సింహులు, హెచ్.నర్సింహులు నియామక పత్రాలు అందుకున్నారు. కార్యదర్శులుగా నర్సింహులు, లక్ష్మీనారాయణతో పాటు ఐదుగురు సభ్యులుగా ఎంపికయ్యారు. గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని నూతన కమిటీ తెలిపింది.

## లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**చిన్న శంకరంపేట అక్టోబర్ 7(జనంసాక్షి):** చందాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ చేన్నగౌని కృష్ణగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం నాడు తహసిల్దార్ మాలతి రేషన్ కార్డ్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు స్మార్ట్ రేషన్ కార్డును ఉపయోగించి చౌక ధర దుకాణాలలో బియ్యం సకాలంలో తీసుకోవాలని ఆమె సూచించారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పద్మ వార్డు సభ్యులు ప్రజలు పాల్గొన్నారు.

# డిజిటల్ చెల్లింపులు... ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలి

- ఎం.ఎన్.ఆర్ విద్యార్థులకు సైబర్ మోసాలపై అవగాహన
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్
- సైబర్ విభాగం డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి







**సంగారెడ్డి, అక్టోబర్ 7 (జనంసాక్షి):** సైబర్ జాగృకత దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి జిల్లాలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఎం.ఎన్.ఆర్. విద్యార్థులకు సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమనీ జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, నిర్వహించారు, ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డిజిటల్ చెల్లింపులు, ఆన్‌లైన్ కొనుగోళ్లు, పెట్టుబడులు, పాక్షిక కాల ఉద్యోగాలు, రుణ దరఖాస్తులు, నకిలీ వ్యక్తిత్వాలతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపే లింకులను తెరవవద్దని, గోప్య సంకేత సంఖ్య, వ్యక్తిగత గుర్తింపు వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని తెలిపారు. తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని చెప్పే పెట్టుబడి, వ్యాపార అవకాశాలను నమ్మవద్దని సూచించారు. పోలీసులు, కేంద్ర దర్యాప్తు సంస్థలు లేదా ఇతర ప్రభుత్వ అధికారుల పేరుతో ఫోన్ చేసి అరెస్టు చేస్తామని బెదిరించి డబ్బులు అడిగితే నమ్మవద్దన్నారు. ప్రభుత్వ సంస్థలు ఫోన్ లేదా వీడియో కాల్ ద్వారా డబ్బులు డిమాండ్ చేయవని స్పష్టం చేశారు.

సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు సమాచారం అందించాలని, సైబర్ నేరాల ఫిర్యాదు వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. సకాలంలో ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండడంతో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులు, విద్యార్థులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సైబర్ విభాగం డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి, ఎం.ఎన్.ఆర్. విశ్వవిద్యాలయ ఉపకులపతి కృష్ణ చలం, రాజేశ్వరన్, గిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కరెంటు కోతలపై రైతుల కన్నెర్ర!

- చండూర్ సబ్‌స్టేషన్ ముట్టడించిన రైతులు
- 9-12 గంటల నిరంతర విద్యుత్ సరఫరాకు డిమాండ్
- సమస్య పరిష్కారం కాకుంటే పెద్దఎత్తున ధర్నాకు హెచ్చరిక





**చిలప్‌చేడ్, అక్టోబర్ 07 (జనంసాక్షి):** పంట చేతికొచ్చే కీలక సమయంలో విద్యుత్ కోతలు, లో–వోల్టేజీ, ట్రిప్పింగ్ సమస్యలు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మెదక్ జిల్లా చిలిపిచేడ్ మండలం చండూర్ గ్రామ రైతులు మంగళవారం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. వ్యవసాయానికి రోజుకు కనీసం 9 నుంచి 12 గంటలపాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

వరి పంటలు చివరి దశకు చేరుకున్న తరుణంలో సాగునీటి అవసరం అధికంగా ఉందని రైతులు తెలిపారు. అయితే విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడటంతో పాటు లో–వోల్టేజీ, ట్రిప్పింగ్ సమస్యలు తీవ్రంగా వేధిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వ్యవసాయ మోటార్లు సక్రమంగా పనిచేయకపోవడంతో పలుమార్లు మోటార్లు కాలిపోయి అదనపు ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. కరెంటు సరఫరా ప్రారంభమైన వెంటనే ట్రిప్పింగ్ కావడంతో పంటలకు సకాలంలో నీరు అందించలేకపోతున్నామని రైతులు వాపోయారు.

**ఫిర్యాదులు చేసినా పరిష్కారం లేదని ఆరోపణ**

విద్యుత్ సమస్యలను ఇప్పటికే ఏఈ, ఏఈడీల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదని రైతులు ఆరోపించారు. పంట చివరి దశలో నీటి అవసరం ఎక్కువగా ఉన్నందున ప్రస్తుతం విద్యుత్ సరఫరాలో ఏర్పడే చిన్నపాటి అంతరాయం కూడా పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు.

**సమస్య పరిష్కారం కాకుంటే పెద్దఎత్తున ధర్నా**

లో–వోల్టేజీ, ట్రిప్పింగ్, విద్యుత్ అంతరాయాలను తక్షణమే పరిష్కరించి వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందించాలని రైతులు డిమాండ్ చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే పెద్దఎత్తున ధర్నా చేపట్టి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యుత్ సమస్యల కారణంగా పంటలకు నష్టం వాటిల్లితే సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని రైతులు స్పష్టం చేశారు.

## సేవా జ్యోతి ర్యాలీలో పాల్గొన్న బిజెపి ఓబీసీ అధ్యక్షుడు కోణం విఠల్



**పెద్ద శంకరంపేట్, అక్టోబర్ 7 (జనంసాక్షి):** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పుట్టినరోజు సందర్భంగా నిర్వహిస్తున్న సేవా హబ్ సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలో బిజెపి అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా జ్యోతి కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి తో పాటు కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ అధ్యక్షులు కోణం విట్టల్ పాల్గొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రజా జీవితంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సంగారెడ్డి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రధాని మోడీ ఆధ్వర్యంలో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి. జిల్లా బిజెపి నాయకులు యాదగిరి పటేల్ అశోక్ కుమార్ రమేశ్ సగుణాకర్, సాయి పటేల్, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతంగా చేపట్టాలి..

- ఎంపీడీవో షాకీర్ అలీ



**పెద్ద శంకరంపేట్, అక్టోబర్ 7(జనంసాక్షి):** గ్రామాలకు చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని పెద్ద శంకరంపేట ఎంపీడీవో షాకీర్ అలీ సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన పంచాయతీ కార్యదర్శులు. పదానికి సిబ్బందితో సమాజంలో మాట్లాడారు.

గ్రామాలలో వీజీ రామ్ జి పథకం ద్వారా చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. గ్రామాలలో సమస్యలను వెంటవెంటనే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ జాకీర్ హుస్సేన్, ఏపీఓ సంతోష్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చందంపేటలో మురుగు కాలువల నిర్మాణం



**చిన్నశంకరంపేట, అక్టోబర్ 7(జనంసాక్షి):** మండలం చందంపేటలోని 9వ వార్డులో రూ.5 లక్షల నిధులతో చేపట్టనున్న మురుగు కాలువల నిర్మాణ పనులను సర్పంచ్ నాయిని ప్రవీణ్‌కుమార్, పాలకవర్గ సభ్యులు ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యదర్శి సంతోష్‌కుమార్, ఉప సర్పంచ్ నర్సింలు, పాలకవర్గ సభ్యులు, నర్సింలు, నరేష్ స్వామి భూపాల్, గ్రామస్తులు దుర్గ సంగయ్య స్వామి గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యారంగంలో సరికొత్త అధ్యాయం: ఎమ్మెల్యే జీఎంఆర్

- రూ.74.50 కోట్లతో క్యూర్ అర్బన్ రీజియన్ పాఠశాలల నిర్మాణానికి శంకుస్థాపన
- పేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే లక్ష్యం



**అమీన్పూర్, అక్టోబర్ 07 (జనంసాక్షి):** పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఆధునిక వసతులతో కూడిన నాణ్యమైన కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే లక్ష్యంగా పటాన్చెరు నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి (జీఎంఆర్) తెలిపారు. అమీన్పూర్ డివిజన్ పరిధిలోని గండిగూడెం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో రూ.25 కోట్ల అంచనా వ్యయంతో అదనపు తరగతి గదుల నిర్మాణం, సుల్తాన్‌పూర్‌లో ఒక ఎకరం 10 గుంటల విస్తీర్ణంలో రూ.49.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న క్యూర్ అర్బన్ రీజియన్ పాఠశాల నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. **ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..** పటాన్చెరు నియోజకవర్గంలోని 9 డివిజన్ల పరిధిలో మొత్తం రూ.364 కోట్లతో క్యూర్ అర్బన్ రీజియన్ పాఠశాలలు, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఇప్పటికే ప్రారంభమైన పనులను వేగవంతంగా పూర్తిచేసి,వచ్చే విద్యా సంవత్సరం నాటికి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని చెప్పారు. నూతనంగా నిర్మించే పాఠశాలల్లో విశాలమైన తరగతి గదులు, ఆధునిక మౌలిక వసతులు మరియు నాణ్యమైన విద్యా బోధన అందించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది, ప్రతి విద్యార్థికి సమానమైన అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ క్యూర్ అర్బన్ రీజియన్ పాఠశాలల నిర్మాణం నియోజకవర్గ విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు, భవిష్యత్ తరాలకు మెరుగైన విద్యా వాతావరణాన్ని అందించడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, నాయకుడు సత్యనారాయణ, డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, TGEWIDC ఈఈ శ్రీనివాస్ రెడ్డి, ఎంఈఓ సుధాకర్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

## గొర్రెల కాపరుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలి: కురుమ సంఘం



**నారాయణఖేడ్, అక్టోబర్ 7 (జనంసాక్షి):** నారాయణఖేడ్ నియోజకవర్గంలో గొర్రెల కాపరులు ఎదుర్కొంటున్న సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరుతూ కురుమ సంఘం నాయకులు మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు హైదరాబాద్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కురుమ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్, ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ.. ప్రాంతంలో గొర్రెల కాపరులకు సకాలంలో పశువైద్య మందులు, టీకాలు అందక జీవనోపాధి దెబ్బతింటోందని తెలిపారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశంపై ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు.

**దీనిపై తలసాని స్పందిస్తూ..** గొర్రెల కాపరుల సమస్యలపై అసెంబ్లీ వేదికగా గళం విప్పుతానని, కురుమల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గొర్రెల కాపరుల సహకార సంఘం మాజీ జిల్లా డైరెక్టర్ భూమన్న, గ్రామ చైర్మన్ దశరథ్, యువజన సంఘాల నాయకులు శ్రీకాంత్, దత్తు, సంతోష్, శశి వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడితే కఠిన చర్యలు

- నిబంధనలు పాటించే స్కానింగ్ కేంద్రాలకే అనుమతులు: అదనపు కలెక్టర్ పాండు



**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 7 (జనంసాక్షి):** గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలను నిషేధించే పీసీపీఎన్డీటీ చట్టాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ పాండు అధికారులను ఆదేశించారు. లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడే స్కానింగ్ కేంద్రాలపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.బుధవారం అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశంలో స్కానింగ్ కేంద్రాల నమోదు, పునరుద్ధరణ, రికార్డుల నిర్వహణ, చట్టం అమలు, ప్రజల్లో అవగాహన కల్పించే అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా పాండు మాట్లాడుతూ, అన్ని అర్హతలు, అవసరమైన అనుమతులు కలిగి, నిబంధనల ప్రకారం నిర్వహించే స్కానింగ్ కేంద్రాలకే నమోదు, పునరుద్ధరణ అనుమతులు ఇవ్వాలని సూచించారు. స్కానింగ్ ద్వారా పుట్టబోయే శిశువు ఆడా, మగా అని నిర్ధారించడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘించే కేంద్రాల అనుమతులను రద్దు చేయడంతో పాటు, అవసరమైతే వాటిని మూసివేసే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

జిల్లాలోని అన్ని స్కానింగ్ కేంద్రాల్లో రికార్డులు, నివేదికలు, రిజిస్టర్ల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని, క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాలని అధికారులకు సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలను ప్రోత్సహించే వారితో పాటు, వాటికి సహకరించే వారిపైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలను ప్రోత్సహించే వారితోపాటు వాటికి సహకరించే వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలని, ముఖ్యంగా గర్భిణులు, వారి కుటుంబ సభ్యులు, వైద్య సిబ్బంది, స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులకు అవగాహన కల్పించాలని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితాదేవి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి శ్రీధర్ కుమార్, కమిటీ సభ్యులు డాక్టర్ లక్ష్మీ శైలజ, డాక్టర్ శశికల, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు న్యాయవాది శైలజ, డాక్టర్ రాజు గౌడ్, సంబంధిత వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## గవ్వలపల్లి చౌరస్తా వద్ద రైతుల రాస్తారోకో



**చిన్నశంకరంపేట, అక్టోబర్ 7(జనంసాక్షి):** వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో తరచు కోతలు విధిస్తున్నారని నిరసిస్తూ బుధవారం చిన్న శంకరంపేట మండలం గవ్వలపల్లి చౌరస్తాలో రైతులు ధర్నా చేశారు. ఈ ధర్నా కార్యక్రమానికి రైతులు పెద్ద ఎత్తున తరలి వచ్చి రోడ్డుపై బైఠాయించారు. మడూరు గ్రామానికి చెందిన రైతు కాడిగళ్ల మల్లయ్య మాట్లాడుతూ మూడు ఎకరాలలో వరి సాగు చేసిన ఒక ఎకరం కూడా పంట పండే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా కష్టాలను అధిగమించి పంటలను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తే విద్యుత్ కోతలతో నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సరఫరాతో పంటలకు నీరు పారక ఎండిపోతున్నాయని రైతులు తెలిపారు. రైతులకు నిరంతర కరెంటు అందించాలని వారు డిమాండ్ చేశారు. ఏడిపి మోహన్ బాబు, ఏఈ దినాకర్, ఎస్సై శివానందం సంఘటన స్థలానికి వెళ్లి రైతులను సముదాయించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పట్లోరి రాజు, నాయకులు కుమార్ గౌడ్, పోచయ్య నాయకులు తోపాటు రైతులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవానికి కృషి చేయాలి

- బండారు శ్రీకాంత్



**తూప్రాన్, అక్టోబర్ 7 (జనంసాక్షి):** గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకురావడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ పిలుపునిచ్చారు. తూప్రాన్, మనోహరాబాద్ మండలాల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటిపై కాంగ్రెస్ జెండా ఎగిరేలా చూడాలని, పార్టీకి నష్టం కలిగించే వారిని సహించేది లేదని స్పష్టం చేశారు. సర్పంచుల ఫోరం మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్కుల మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. అనంతరం రెండు మండలాల కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నూతన కార్యవర్గాలను ప్రకటించి నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజం: మున్సిపల్ చైర్‌పర్సన్ రజిని




**తూప్రాన్, అక్టోబర్ 7(జనంసాక్షి):** ప్రతి గృహిణి తక్కువ ఖర్చుతో అధిక పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ఇంట్లోనే తయారు చేసుకోవాలని తూప్రాన్ మున్సిపల్ చైర్‌పర్సన్ రజిని రవీందర్ గౌడ్ సూచించారు. తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన పోషణ మాసోత్సవాల కార్యక్రమాన్ని ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ మహిళల్లో రక్తహీనతను నివారించడానికి ఆకుకూరలతో కూడిన సమతుల ఆహారం తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్, ఇన్‌చార్జ్ అధికారిణి హేమ భార్గవి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనశైలితో అనారోగ్య సమస్యలను నివారించవచ్చని పేర్కొన్నారు. వైస్ చైర్మన్ సమత కాశిరెడ్డి మాట్లాడుతూ తల్లులు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం బాగుంటుందని, అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్యక్రమంలో భాగంగా 6 నెలలు పూర్తయిన 10 మంది శిశువులకు సామూహిక అన్నప్రాశన, మరో 10 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం అంగన్వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శన స్టాళ్లను పరిశీలించి, పాల్గొన్న అందరిచే పోషణ ప్రతిజ్ఞ చేయించారు. తర్వాత తూప్రాన్ బస్టాండ్‌లో ప్రయాణికులైన తల్లులు తమ పిల్లలకు ఇబ్బంది లేకుండా పాలు ఇవ్వడం కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'బ్రెస్ట్ మిల్క్ ఫీడింగ్ బాక్స్'ను చైర్‌పర్సన్ ప్రారంభించారు. ప్రయాణ సమయంలో తల్లులు భయం లేకుండా స్వేచ్ఛగా పాలు పట్టుకోవడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు రాధా కుమారి, లక్ష్మి, జోత్స్న, హెల్త్ సూపర్వైజర్ గంగమని, ఐసీడీఎస్ సూపర్వైజర్లు శివకుమారి, సుజాత, సంతోషి, అంగన్వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల 'అలయ్ బలయ్' పోస్టర్ విడుదల

- ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి
- 250 గజాల స్థలం.. రూ.25 వేల పింఛన్ అమలు చేయాలి



**రామాయంపేట, అక్టోబర్ 7 (జనంసాక్షి):** మెదక్ జిల్లా రామాయంపేటలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 16న నిర్వహించనున్న 'అలయ్ బలయ్ ఆత్మీయ సన్మానం' గోడపత్రికను బుధవారం ఆవిష్కరించారు. ఫోరం జిల్లా అధ్యక్షుడు గుండా దాస్ (ఎల్లం) మాట్లాడుతూ.. ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసిన నాయకులు, కార్మికులు, ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల ప్రతినిధులను పార్టీలకు అతీతంగా సన్మానించనున్నట్లు తెలిపారు. అలాగే తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ. 25 వేల పింఛన్, హెల్త్‌కార్డులు అందించాలని, కేసులు ఎదుర్కొన్న వారిని గుర్తించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, లేని పక్షంలో భవిష్యత్తులో ప్రజాస్వామ్యయుతంగా పోరాడుతామని పేర్కొన్నారు.

## బిలాల్‌పూర్ పీహెచ్‌సీని తనిఖీ చేసిన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ





**కోహీర్, అక్టోబర్ 7 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని బిలాల్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం డిప్యూటీ డీఎం హెచ్ఓ డా. సీతారామ రాజు ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్య సేవలు, రోగుల నమోదు, ఓపీ సేవ లు, ల్యాబొరేటరీ, ఫార్మసీకి సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు.
అలాగే కేంద్రం పరిధిలో అమలు చేస్తున్న వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలు, ఇప్పటివరకు సాధించిన ప్రగతి, కార్యక్రమాల అమలు తీరు తదితర అంశాలపై వైద్య సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రజ లకు అందుతున్న వైద్య సేవలపై కూడా ఆరా తీశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొనసాగుతున్న చిన్నపాటి మరమ్మతు పనులను పరిశీలించిన డిప్యూటీ డీఎంహెచ్ ఓ.. పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సిబ్బందికి సూచిం చారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అం దించేందుకు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు నాణ్యమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సమర్థవంతంగా సాధిం చేందుకు నిరంతర పర్యవేక్షణతో ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిలాల్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ దివ్యజ్యోతి, సీహెచ్ఓ రవి కుమార్, మొగులయ్య, ఆరోగ్య విస్తరణ అధికారి నరసింహా, సూపర్‌వైజర్ రాజమణి, ఎల్‌టీ సోనాబాయి, నిరంజన్, విశాల, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

## చేయూత పెన్షన్ వెరిఫికేషన్‌లో పారదర్శకతకు పెద్దపీట....

- DRDO సీహెచ్ శ్రీనివాస్‌రావు క్షేత్రస్థాయి తనిఖీలు





**చిలప్‌చేడ్, అక్టోబర్ 7 (జనంసాక్షి):** మెదక్ జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి (DRDO) సీహెచ్ శ్రీనివాస్‌రావు బుధవారం చిలప్ చేడ్ మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ముందుగా మం డల పరిషత్ కార్యాలయంలో VBG RAM G సిబ్బంది తో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించి, ఆయా పనుల పురోగతి, ప్రభుత్వ పథకాల అమలు తీరుపై అధికారులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పను లను నిర్ణీత సమయంలో పూర్తి చేయడంతో పాటు ప్రభుత్వ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరేలా చర్య లు తీసుకోవాలని సూచించారు.
అనంతరం మండల కేంద్రంలో 'చేయూత' పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లకు నేరుగా వెళ్లి క్షేత్ర స్థాయి పరిశీలన (వెరిఫికేషన్) చేపట్టారు. దరఖాస్తు దారుల అర్హతలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా పార దర్శకంగా వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా అర్హత ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నీటిని పొదుపుగా వాడుదాం కరువును జయిద్దాం

- సమన్వయంతో పని చేద్దాం సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుదాం
- స్పెషల్ ఆఫీసర్ సురేష్ బాబు






**కౌడిపల్లి, అక్టోబర్ 07 (జనంసాక్షి):** అధికారులు సర్పం చులు సమన్వయంతో పనిచేసి సమస్యలు లేని గ్రామాలు గా తీర్చిదిద్దాలని మండల ప్రత్యేక అధికారి సురేష్ బాబు, అన్నారు. బుధవారం కౌడిపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీడీవో శ్రీనివాస్, అధ్యక్షతన మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా వివిధ శాఖల అధికారులు ఆయా శాఖలలో నిర్వ హించిన పనులు సభకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడు చంద్రం కృష్ణా గౌడ్, కౌడిపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధాన ఉపా ధ్యాయురాలు తీరుపై మండి పడ్డారు. పాఠశాల బోధన, క్రమశిక్షణ లేక దివాలా తీసింది అని అన్నారు. ఎంఈఓ స్పందించి వెంటనే విచారణ జరిపి పాఠశాలకు పూర్వ వైభవం వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ గ్రామాల సర్పంచులు కరెంటు, సాగునీరు, తాగునీరు, ఇందిరమ్మ ఇండ్లు,వాటి మంజూరు,విద్య,వైద్యం, ధాన్యం కొనుగోలు, విబిజీ రాంజీ పనులు ప్రధాన అంశాలతో పాటు గ్రామ పంచాయతీ సమస్యలపై ఆయా శాఖల అధికారులతో చర్చించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్య లను పరిష్కరిస్తామని ఆయా శాఖల అధికారులు తెలి పారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్, ఎంఈఓ బాలరాజు, డిప్యూటీ తాసిల్దార్ జహీర్,ఆయా గ్రామాల సర్పంచులు చంద్రం కృష్ణ గౌడ్, పట్లోరీ శ్రీని వాస్, బోయిని వీరయ్య, తిరుపతిరెడ్డి ,రవి యాదవ్, ప్రవీణ్ రెడ్డి, కుమార్, యశోద, బాలకృష్ణ, కుమ్మరి శివలీల సతీశ్ ,సంధ్య పుష్పి నాయక్, శేకులు యాదవ్, సత్యం గౌడ్, రాజు నాయక్, రమేష్ నాయక్, కుద్బుద్దీన్, రాములు, వివిధ శాఖల అధికారులు ఏఈ సాయి కుమార్, మెడికల్ ఆఫీసర్ శ్రీకాంత్, ఏఈ మారుతి, ఐకెపి సీసీ ఉమాశంకర్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాములో కట్టుదిట్టమైన భద్రత

### నెలవారీ తనిఖీలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ఆదర్శ్ సురభి






**వనపర్తి, అక్టోబర్ 7 (జనంసాక్షి):** జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాములో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉన్నాయని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. బుధవారం ఆర్డీవో కార్యాలయం వెనుక ఉన్న ఈవీఎం గోదామును నెలవారీ తనిఖీల్లో భాగంగా ఆయన పరిశీలించారు.
ఈసీఐ మార్గదర్శకాల మేరకు గోదాము వద్ద భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేయడంతో పాటు సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. ఈవీఎం గోదామును ఎప్పటి కప్పుడు నిబంధనల ప్రకారం తనిఖీ చేసి సమగ్ర నివేదిక లు సమర్పిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. తహసీల్దార్ రమేష్ రెడ్డి, ఇతర అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# ముఖ్యమంత్రిపై విషప్రచారం తగదు

- తప్పుడు ప్రసారంపై విచారణ చేపట్టాలి
- ఎస్పీకి వినతి పత్రం అందజేత
- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి



**శివ్వంపేట, అక్టోబర్ 7(జనంసాక్షి):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై అలాగే వారి కుటుంబ సభ్యులపై కొంతమంది వ్యక్తులు ఒక యూట్యూబ్ ఛానల్‌లో నిరాధారణమైన ఆరో పణలు చేస్తూ, ప్రచారం చేయడం తగదని జిల్లా గ్రంథా లయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అవాకులు చివాకులు పేలు తూ విష ప్రచారం గావిస్తున్న వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బండారి గంగాధర్ మరి కొంతమంది నాయకుల తో బుధవారం మెదక్ లోని ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు కలిసి ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా సుహాసిని రెడ్డి మాట్లాడుతూ సదరు ప్రచారం లో వాస్తవాలను వక్రీకరించి, ప్రజలను తప్పు తొవ్వ పట్టించే విధంగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా ఉద్దేశ పూర్వకంగా ప్రసారం చేసినట్లు స్పష్టంగా కనిపిస్తుందన్నారు. కాబట్టి ఇటువంటి తప్పుడు ప్రచారం ప్రజల్లో అనవసరమైన అపోహలు సృష్టిస్తూ, గందరగోళం కలిగించే విధంగా యూట్యూబ్ ఛానల్ అలాగే ఆ ఛానల్ కు సంబంధించిన వ్యక్తులపై, ప్రచారం చేసిన వీడియోలు, పోస్టులను వాటి వాస్తవికతపై సమగ్ర విచారణ జరిపి, చట్టవిరుద్ధమైన కథ నాలు ప్రచారం చేసిన వారిపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. పరువు ప్రతిష్టకులకు భంగం కలిగించే విధంగా ఎవరు మాట్లాడిన అసత్య ప్రచారాలు చేసిన వారిపై నిఘా ఉంచి, వెంటనే చట్టరీత్యామైన చర్యలు తీసుకోవాలని సుహాసిని రెడ్డి ఎస్పీని కోరారు. ఎస్పీని కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బండారి గంగాధర్, నాయ కులు మాచినూరి శ్రీశైలం యాదవ్, కొండి దుర్గేష్, బెస్త చిరంజీవులు, కుమ్మరి నాగరాజు తదితరులు ఉన్నారు.

## పరిహారం ఎంత ఇస్తారని తెలిసినంకనే సర్వే జరిపించండి

- నమ్ముకున్న భూమిపై మీకు కక్ష ఎందుకు
- డిండి నార్లాపూర్ కాల్వ సర్వే.. చెట్ల లెక్కింపును అడ్డుకున్న రైతులు



**వెల్దండ, అక్టోబర్ 7(జనంసాక్షి):** తాతల కాలం నుండి భూమిని నమ్ముకుని వ్యవసాయం చేసుకుంటూ కుటుంబా లను పోషించుకుంటున్న మా పొట్ట కొట్టడం ఏమాత్రం ప్రభుత్వానికి తగ్గదని అజిలాపూర్ రైతులు తమ బాధ ఆవేదన వ్యక్తం చేశారు.డిండి నార్లాపూర్ ఎత్తిపోతల పథక జలాశయ నిర్మాణంలో భాగంగా బుధవారం ఆజిలాపూర్ గ్రామ శివారులో కాలువ సర్వే నిర్మాణంలో భాగంగా తహసిల్దార్ కార్తీక్ కుమార్ సీఐ రఘువీర్ రెడ్డి ఫారెస్ట్ ఎఫ్ఆర్ఓ అబ్దుల్ సుబ్బార్ ఎస్సై యుగంధర్ రెడ్డి ఆయా శాఖల సిబ్బందితో కలిసి రైతుల పొలాల దగ్గరికి వెళ్లడం తో రైతులు ఒక్కసారి అధికారులపై బగ్గుమన్నారు సర్వే నెంబర్లు 154 లో 153 ఎకరాల169. 170.171 177.182.183. సర్వే నెంబర్లలో మొత్తం 186 ఎకరాల భూముల గుండా జలాశయ కాలువ నిర్మాణం జరగ నుండి పోలీస్ బందోబస్తు మధ్య సర్వే లెక్కింపు ప్రక్రియకు పూనుకొనగా భూ నిర్వాసితులు అభ్యంతరం వ్యక్తం చేశా రు. ముందుగా నష్టపరిహారం ఎంత చెల్లిస్తామని స్పష్టత వచ్చిన తర్వాతనే ముందుకెళ్లాలని రైతులు చెప్పగా కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది తమకు న్యాయం జరిగే వరకు సర్వేను అడ్డుకుంటామని అన్నారు. కార్యక్రమంలో పోలీసు అటవీశాఖ రెవెన్యూ సిబ్బంది రైతులు ఉన్నారు

## ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి: జడ్జి దీపా



**శ్రీరంగాపూర్ అక్టోబర్ 7 (జనంసాక్షి):** శ్రీరంగాపురం మండలంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ దీపా కాసరగడ్డ మాట్లాడుతూ.. ఇరువర్గాలు పరస్పర అంగీకారంతో కేసు లను పరిష్కరించుకోవడానికి రాజీ మార్గమే రాజమార్గ మని సూచించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తం గా ఉండాలని, 6 నుండి 14 ఏళ్ల పిల్లలకు ఉచిత విద్యా హక్కు చట్టం వర్తిస్తుందని తెలిపారు.
తల్లిదండ్రులను, వయోవృద్ధులను నిర్లక్ష్యం చేయడం చట్ట వ్యతిరేకమని పేర్కొన్నారు. వయోవృద్ధుల సమస్యల పరి ష్కారానికి ఆర్డీవో కార్యాలయంలోని ట్రిబ్యునల్‌లో లేదా న్యాయ సేవాధికార సంస్థకు దరఖాస్తు చేసుకోవచ్చని భరో సా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కృష్ణయ్య, ఎస్ఐ హిమబిందు, సర్పంచ్ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ పెండింగ్ నోటీసులు, విచారణలు వేగవంతం చేయాలి

- ప్రతి క్లెయిమ్, అభ్యంతరంపై నిబంధనల ప్రకారం చర్యలు
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 7(జనంసాక్షి):** అర్హత కలిగిన ప్రతి ఒక్క ఓటరుకు ఓటరు జాబితాలో స్థానం కల్పించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్-2026 ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న నోటీసులు, విచారణలను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.
కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండుతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం ఎస్ఐఆర్ ప్రక్రియపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్ఐఆర్‌లో అందిన ప్రతి క్లెయిమ్, అభ్యంతరాన్ని నిర్దేశిత ప్రామాణిక కార్యాచరణ విధానం ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.
ఎస్ఐఆర్ ప్రక్రియలో గుర్తించిన అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసులు జారీ చేసి, వారి నుంచి అవసరమైన పత్రాలు, వివరాలను సేకరిస్తున్నామని చెప్పారు. అందిన పత్రాలను నిబంధనల ప్రకారం పరిశీలించి తదుపరి ప్రక్రియలో పొందుపరుస్తున్నట్లు తెలిపారు.
నోటీసులు అందుకున్న వారిలో అర్హత కలిగిన ఓటర్లు ఉంటే, అవసరమైన పత్రాలు సమర్పించేలా బూత్ స్థాయి ఏజెంట్లు సహకరించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. అర్హులైన ప్రతి ఓటరుకు జాబితాలో స్థానం కల్పించేలా అధికారులు, రాజకీయ పార్టీలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



# ఘనంగా పోషణ మాస కార్యక్రమం



**నారాయణఖేడ్, అక్టోబర్ 07 (జనంసాక్షి):** నారాయణఖేడ్ ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో 9వ పోషణ మాస కార్యక్రమాన్ని జూకల్ శివారులోని కన్వెన్షన్ హాల్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు శ్రీమంతం, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలు చేపట్టారు.
ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ నగేష్ కుమార్ షెట్కార్ మాట్లాడుతూ.. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు సరైన పోషకాహారం అందించడం ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. జిల్లా సంక్షేమ అధికారి కె. లలిత కుమారి మాట్లాడుతూ గర్భిణీలు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుంటూ వైద్యుల సూచనల మేరకు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.
అనంతరం తల్లి-శిశు ఆరోగ్యం, పౌష్టికాహారం, పరిశుభ్రత, టీకాలు, పిల్లల ఎదుగుదలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ ఎన్. సుజాత, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తరణి, అంగన్వాడీ సూపర్‌వైజర్లు జమున, ప్రమీల, బ్యూలా డేవిడ్, అంగన్వాడీ సిబ్బంది, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

# SIR ప్రక్రియకు వ్యతిరేకంగా నారాయణఖేడ్‌లో కాంగ్రెస్ నిరసనఓటర్ల జాబితా

- ఎన్నికల కమిషనర్ రాజీనామాకు డిమాండ్..
- అమిత్ షా దిష్టిబొమ్మ దహనం

**నారాయణఖేడ్, అక్టోబర్ 07 (జనంసాక్షి):** సవరణలో చేపడుతున్న ప్రత్యేక విస్తృత సవరణ (SIR) ప్రక్రియను నిరసిస్తూ, భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నారాయణఖేడ్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి నాయకత్వంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ.. SIR ప్రక్రియలో ఓటర్ల హక్కులకు భంగం కలిగించేలా, అన్యాయంగా పేర్లు తొలగించే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్ తన స్వతంత్రతను, విశ్వసనీయతను కాపాడుకుంటూ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. సీఈసీ రాజీనామా చేసే వరకు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు విఠల్ రావు పాటిల్, సర్దార్ నాయక్, జ్ఞానేశ్వర్ రెడ్డి, పండరి రెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు, కౌన్సిలర్లు, సర్పంచులు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






# శ్రీనివాస్ కుటుంబానికి ఆర్థిక సాయం



**గుమ్మడిదల, అక్టోబర్ 7 (జనంసాక్షి):** గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామానికి చెందిన శ్రీనివాస్ ఇటీవల రైలు ప్రమాదంలో మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని ఎన్ఎంఆర్ టీం సభ్యులు పరామర్శించారు. మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ రూ.20 వేలు, నల్లవల్లి సర్పంచ్ రాణి సురేష్ రూ.5 వేల ఆర్థిక సాయాన్ని ఎన్ఎంఆర్ టీం ద్వారా అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెంటారెడ్డి, ఉపసర్పంచ్ పాషాభాయ్, వార్డు సభ్యులు, ఎన్ఎంఆర్ టీం సభ్యులు పాల్గొన్నారు.

# దీక్షాపరుడిపై దాడిని ఖండించిన బిఆర్ఎస్ ఎస్టీ సెల్ నాయకులు



**సిర్గాపూర్, అక్టోబర్ 7 (జనంసాక్షి):** కంది మండలం ఎర్దనూర్ తండాలో భవానీ మాత దీక్షాపరుడు గోపాల్‌పై క్రషర్ యజమాని మహిపాల్ రెడ్డి చేసిన దాడిని బిఆర్ఎస్ ఎస్టీ సెల్ నాయకులు నారాయణ నాయక్, ప్రేమ్ నాయక్ తీవ్రంగా ఖండించారు. క్రషర్ బ్లాస్టింగ్ వల్ల దుమ్ము వచ్చి పడుతుండటంతో నిలిపివేయాలని కోరినందుకు దుర్భాషలాడి దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ ఘటనను బంజారా సమాజంపై జరిగిన దాడిగా పేర్కొంటూ, బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

# రామాయంపేట స్నేహ విద్యాసంస్థల్లో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

- చదువుతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి : చైర్మన్ సత్యనారాయణ
- చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి : సర్కిల్ ఇన్స్పెక్టర్
- కళాశాల రోజులే భవిష్యత్తుకు తొలి మెట్టు : తహసీల్దార్ రజినీ కుమారి

**రామాయంపేట,అక్టోబర్ 7 (జనంసాక్షి):** రామాయంపేట పట్టణంలోని ఎర్రం విఠల్ ఫంక్షన్ హాల్‌లో స్నేహ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రామాయంపేట తహసీల్దార్ రజినీకుమారి, సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.సైదా నాయక్ పాల్గొన్నారు.
ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని, కళాశాల దశ భవిష్యత్తుకు తొలి మెట్టు వంటిదని అన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రమశిక్షణ, కృతజ్ఞతా భావంతో ముందుకు సాగాలని సూచించారు.
చదువును నిర్లక్ష్యం చేయకుండా లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధన చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా నాయక్, ఎస్ఐ బాల్‌రాజు, తహసీల్దార్ రజినీకుమారి, ఆర్ఐ గోపి, ప్రిన్సిపాల్ రవి, వైస్ ప్రిన్సిపాల్ గోపాలస్వామి,లెక్చరర్లు రంజిత్‌కుమార్, వీవిఎన్‌చారి,శ్రీనివాస్,నవీన్,నర్సింహులు, స్రవంతి తదితరులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలతో సత్కరించారు. ఫ్రెషర్స్ డే సందర్భంగా విద్యార్థులు ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు.




# ఇంటి పరిశుభ్రతతోనే ఆరోగ్యం

- కౌన్సిలర్ జైపాల్ నాయక్



**తూప్రాన్, అక్టోబర్ 7(జనంసాక్షి):** తూప్రాన్ మున్సిపాలిటీ 4వ వార్డులో వైస్ చైర్మన్ కొక్కొండ సమతా కాశిరెడ్డి, కౌన్సిలర్ జైపాల్ నాయక్ బుధవారం తడి, పొడి చెత్త బుట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జైపాల్ నాయక్ మాట్లాడుతూ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామని, లేదంటే అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు వస్తాయని తెలిపారు. చెత్తను వేరు చేసి ఇవ్వడం వల్ల మున్సిపల్ సిబ్బందికి నిర్వహణ సులభమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాములు, కమిషనర్ రమేష్, మేనేజర్ శ్రీకాంత్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ కుమారుడు మృతి

- ఎమ్మెల్యే పల్లా పరామర్శ

**కొమురవెల్లి, (జనంసాక్షి):** కొమురవెల్లి మండలం అయినాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ పబ్బోజు విజేందర్ కుమారుడు పబ్బోజు మురళి కార్తీక్ కుషాయిగూడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు.



సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన బుధవారం ఉదయం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి వారి నివాసానికి చేరుకుని మురళి కార్తీక్ మృతదేహానికి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు.

# అనాథ పిల్లలకు దాతల సహాయం

- శ్రీ వేద జనని వేదిక స్మార్త పీఠం

**సిర్గాపూర్ అక్టోబర్ 7 (జనంసాక్షి):** సిర్గాపూర్ మండలంలోని వాసర్ గ్రామానికి చెందిన ప్రకాష్ ఆకస్మికంగా మృతి చెందడంతో ఆయన పిల్లలు భవాని, మహానంద, శివాని, అనాథలుగా మారారు. ఈ విషయం తెలుసుకున్న దాతలు స్పందించి పిల్లలకు నెలకు సరిపడే నిత్యవసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాథోడ్ వెంకట్, టీచర్ కర్ర గోవింద్ నాయక్ పాల్గొన్నారు,



# పనులు పరిశీలించి.. సూచనలు చేసి



**పాపన్నపేట, అక్టోబర్ 7 (జనంసాక్షి):** క్షేత్రస్థాయిలో కూలీలకు అవసరమైన టెంట్లు,తాగునీటి సౌకర్యం కల్పించాలని మెదక్ డీపీఓ యాదయ్య పేర్కొన్నారు. బుధవారం నార్సింగి గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించి, కూలీలతో మాట్లాడారు. ప్రజలు తమ ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని,తగు సూచనలు చేశారు. సర్పంచ్ మల్లేశం,పంచాయితీ కార్యదర్శి వెంకటేశం, ఫీల్డ్ అసిస్టెంట్ రవి తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

- టీజీఐఐసీ మాజీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి



**సదాశివపేట, అక్టోబర్ 7(జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని టీజీఐఐసీ మాజీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. బుధవారం సదాశివపేట మండలం వెల్టూరులో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రూ.30 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, మరో రూ.30 లక్షలతో నిర్మించనున్న కల్వర్టు పనులకు నిర్మల జగ్గారెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ గడీల రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చాట్ల సిద్దన్న, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఒగ్గు శ్రీనివాస్, గ్రామశాఖ అధ్యక్షుడు నవీన్‌కుమార్‌తో పాటు పలువురు నాయకులు, గ్రామపంచాయతీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

## భార్యపై హత్యాయత్నం.. భర్త అరెస్ట్




**ఉప్పునుంతల (జనంసాక్షి):** భార్యపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో ఉప్పునుంతల గ్రామానికి చెందిన పొట్టల బాలయ్య (36)ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఉప్పునుంతల ఎస్సై పుట్ట మహేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 4న బాలయ్య తన భార్యపై హత్యాయత్నానికి పాల్పడినట్లు ఫిర్యాదు అందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, సోమవారం బాలయ్యను అరెస్ట్ చేశారు. అనంతరం నిందితుడిని న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్సై పుట్ట మహేష్ తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని ఎస్సై పేర్కొన్నారు.

## వీల్ చైర్ పంపిణీతో డాక్టర్ రితిక్ రెడ్డి జన్మదిన వేడుకలు



**గండీడ్, అక్టోబర్ 7 (జనంసాక్షి):** టిపిసిసి మెంబర్, టీఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ టి. రితిక్ రెడ్డి జన్మదిన వేడుకలను గండీడ్‌లో సేవా కార్యక్రమంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొమిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చాకలి హనుమంతు అనే దివ్యాంగు డికి రితిక్ రెడ్డి వీల్ చైర్ పంపిణీ చేశారు. వికలాంగులకు, అవసరమైన వారికి సేవ చేయడం ఎంతో సంతృప్తినిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అనంత లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకులు జితేందర్ రెడ్డి, వెంకటయ్య, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశానికి చేర్యాల బీఆర్ఎస్ నేతలు



**చేర్యాల, అక్టోబర్ 07 (జనంసాక్షి):** జనగామ జిల్లా యశ్వంతాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన వరంగల్ – ఖమ్మం – నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి చేర్యాల బీఆర్ఎస్ నాయకులు హాజరయ్యారు. జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికల వ్యూహాలపై చర్చించారు.

కార్యక్రమంలో చేర్యాల పట్టణ పార్టీ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర రావు, కౌన్సిలర్ బుధాది సురేష్, కో–ఆప్షన్ సభ్యులు, నాయకులు తిరుపతి గౌడ్, రాజేష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్ దరఖాస్తుల వెరిఫికేషన్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) భీమ్యా నాయక్

**శ్రీరంగాపూర్, అక్టోబర్ 7 (జనంసాక్షి):** పెన్షన్ లబ్ధిదారుల వివరాల పరిశీలన, వెరిఫికేషన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) భీమ్యా నాయక్ ఆదేశించారు. శ్రీరంగాపూర్ మండలం కంబాలాపూర్ గ్రామంలో కొనసాగుతున్న పెన్షన్ వెరిఫికేషన్ ప్రక్రియను అదనపు కలెక్టర్, డీఆర్డీఓ ఉమా మహేశ్వర్ రెడ్డితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పెన్షన్ లబ్ధిదారుల వివరాలు, వారి దరఖాస్తులు, వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతున్న తీరును సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హత కలిగిన వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. వెరిఫికేషన్ సందర్భంగా లబ్ధిదారుల నుంచి అవసరమైన వివరాలు, ధ్రువపత్రాలను సక్రమంగా పరిశీలించి, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**ఉపాధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి...**

అనంతరం శ్రీరంగాపూర్ గ్రామంలో వీబీజీ రామ్జీ పథకం కింద చెరువు ఇన్‌లెట్, అవుట్‌లెట్ కాలువల వద్ద కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను అదనపు కలెక్టర్ భీమ్యా నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధి పనుల్లో పాల్గొంటున్న కూలీలతో నేరుగా మాట్లాడి, వారికి ఎదురవుతున్న సమస్యలు, పనుల నిర్వహణకు సంబంధించిన ఇబ్బందులను అడిగితెలుసుకున్నారు. ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్న కూలీలకు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా సకాలంలో వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్దేశించిన ప్రకారం పనులను పూర్తిచేయాలని సూచించారు.



కూలీలకు తాగునీరు, ఇతర అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని, పనుల ప్రదేశంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ సూచించారు. పెన్షన్ వెరిఫికేషన్, ఉపాధి హామీ పనుల అమలులో అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టి, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రక్రియలను పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, చెన్నయ్య, ఏపీఓ రాజు, పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులుతో పాటు సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలో అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలి

- మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి
- అనుమతులు లేకుండానే వార్డుల్లో నిధుల డ్రా
- అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరుతో భారీ వసూళ్లు
- కలెక్టర్ జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని డిమాండ్

**మక్తల్, అక్టోబర్ 7 (జనంసాక్షి):** మక్తల్ మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ప్రారంభమైన నాటి నుంచి అభివృద్ధి మరుగైపోయి, కేవలం అవినీతే రాజ్యమేలుతోందని ఆయన తీవ్రంగా ఆరోపించారు.

స్థానిక మున్సిపాలిటీలోని 16 వార్డుల్లో ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండా, ఒక్కో వార్డుకు లక్ష రూపాయల చొప్పున కేటాయించుకుని పనులు చేయకుండానే నిధులు స్వాహా చేశారని విమర్శించారు. ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండా ఇటీవల 12 మందిని అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించుకుని, ఒక్కొక్కరి వద్ద రూ. 1 లక్ష నుండి రూ. 2 లక్షల వరకు వసూలు చేసిన ఘనత ఈ పాలకవర్గానికి దక్కుతుందని మండిపడ్డారు.

పట్టణంలో పారిశుద్ధ్య పనుల కోసం టెండర్లు పిలిచి, ఆ పనులను కాంట్రాక్టర్లతో చేయించకుండా మున్సిపాలిటీ సిబ్బందితో చేయించడం ఏంటని ఆయన నిలదీశారు. పాలకవర్గం మొదటి సంవత్సరం పూర్తి కాకముందే ఇంతటి అవినీతికి పాల్పడుతుంటే స్థానిక మంత్రి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ అక్రమాలు మంత్రికి తెలిసే జరుగుతున్నాయా లేక తెలియకుండా జరుగుతున్నాయా ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పట్టణంలో మంచినీటి కొరత తీవ్రంగా ఉందని, పారిశుద్ధ్యం పూర్తిగా లోపించిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పురపాలక కమిషనర్ ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. అధికారులు వెంటనే



స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కార్యాలయం ముందట పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

ఈ విలేకరుల సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి.నరసింహ గౌడ్, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు ఏ. మహిపాల్ రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు జె. చిన్న హనుమంతు, గుర్లపల్లి సర్పంచ్ గాలి రెడ్డి, మాజీ కౌన్సిలర్లు అన్వర్ హుస్సేన్, జగ్గలి రాములు, ఎరుకల మొగిలప్పతో పాటు జుట్ల శంకర్, శివారెడ్డి, రఘు, అమ్రేష్, మనన్, రామలింగం, ఈశ్వర్ యాదవ్, అశోక్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

# ఓట్ల దొంగతనంపై సమగ్ర విచారణ జరపాలి

- విద్యార్థుల బకాయిలు విడుదల చేయాలి..
- అచ్చంపేటలో ఉన్నత విద్యాసంస్థలు ఏర్పాటు చేయాలి

**అచ్చంపేట, అక్టోబర్ 7 (జనంసాక్షి):** విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించడంతో పాటు ఎన్నికల వ్యవస్థలో జరుగుతున్న అవకతవకలపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని AISF తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఎన్నికల వ్యవస్థలో కోట్లాది ఓట్లను తొలగించేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కోరారు.

అచ్చంపేట టీఎన్జీవో భవన్‌లో బుధవారం AISF నాగర్‌కర్నూల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పుట్ట లక్ష్మణ్ మాట్లాడారు. ఎన్నికల సంఘంలోని ఇతర కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు.

**రూ.11 వేల కోట్లకు పైగా విద్యార్థుల బకాయిలు**

తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు రూ.11 వేల కోట్లకు పైగా పేరుకుపోయాయని పుట్ట లక్ష్మణ్ తెలిపారు. గత ప్రభుత్వ కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.7 వేల కోట్లతో పాటు అనంతరం పేరుకుపోయిన రూ.4 వేల కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయని పేర్కొన్నారు. విద్యాశాఖ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద ఉన్నప్పటికీ విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం తగిన శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు.

"మాటలు కోటలు దాటుతున్నాయి.. కానీ విద్యార్థుల సమస్యల పరిష్కారాలు గడప కూడా దాటడం లేదు" అని ఎద్దేవా చేశారు. పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**GO 7, 8, 9 రద్దు చేయాలి...**

విద్యార్థులు, విద్యాసంస్థలకు ఇబ్బందులు కలిగిస్తున్న GO MS No.7, 8, 9లను వెంటనే రద్దు చేయాలని AISF డిమాండ్ చేసింది. విద్యాశాఖకు పూర్తిస్థాయి మంత్రిని నియమించడంతో పాటు ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, MEO,DEO లెక్చరర్ తదితర పోస్టులను భర్తీచేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సంక్షేమ హాస్టళ్లలో తరచూ ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు చోటుచేసుకోవడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.




**అచ్చంపేటలో పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలలు**

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట ప్రాంతంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాలతో పాటు బాసర ట్రిపుల్ ఐటీ తరహా ఉన్నత విద్యాసంస్థను ఏర్పాటు చేయాలని సమావేశంలో తీర్మానించినట్లు నాయకులు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విద్యార్థులకు ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని పుట్ట లక్ష్మణ్ హెచ్చరించారు.

ఈ సమావేశంలో AISF తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు బలుముల ప్రేమ్‌కుమార్, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు నరేష్, అచ్చంపేట నియోజకవర్గ నాయకులు ఫన్నీ చరణ్, శ్రావణ్, ప్రిన్స్ పాల్గొన్నారు.

# విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలి



- జిల్లా కలెక్టర్ ప్రియాంక
- మక్తల్ మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ
- సివిల్స్ సాధనకు ప్రాథమిక అంశాలపై పట్టు ముఖ్యం
- ఎస్ఏ-1 పరీక్షలు, వంటగది, స్టోర్ రూమ్‌ల పరిశీలన

**మక్తల్, అక్టోబర్ 07 (జనంసాక్షి):** మక్తల్ పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ ప్రియాంక బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరుగుతున్న ఎస్ఏ-1 పరీక్షల తీరును, విద్యార్థుల అభ్యసన స్థాయిలను పరిశీలించారు. పాఠశాలలో పదో తరగతి తరగతి గదిని సందర్శించిన కలెక్టర్ ప్రియాంక, విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించారు. వారి విషయ పరిజ్ఞానం, చదువుపై ఆసక్తి, భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి అనంతరం ఏం చదవాలని అనుకుంటున్నారని ప్రశ్నించి.. డాక్టర్లు, ఇంజనీర్లు, పోలీసు అధికారులు కావాలనుకునే విద్యార్థుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సివిల్స్ (ఐఏఎస్/ఐపీఎస్) పరీక్షల విధానంపై విలువైన మార్గదర్శనం చేశారు. ఐఏఎస్ కావాలంటే ఏ విధంగా చదవాలి, సివిల్స్ పరీక్షల్లో ఎలాంటి అంశాలు ఉంటాయనే విషయాలను విద్యార్థులకు వివరంగా వివరించారు. పోటీ పరీక్షల్లో ప్రాథమిక విషయ పరిజ్ఞానానికి ఎంతో ప్రాధాన్యత ఉంటుందని, 8, 9, 10వ తరగతుల్లో చదివే సైన్స్, సోషల్ సబ్జెక్టుల్లోని బేసిక్స్ (ప్రాథమిక అంశాలు)పై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కేవలం బట్టీపట్టి చదవడం కాకుండా, విషయాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకునే అలవాటు చేసుకోవాలని హితవు పలికారు. పోటీ పరీక్షల్లో లక్షలాది మంది పాల్గొంటున్నప్పటికీ, తమ లక్ష్యాన్ని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఇతరులు చదవడం లేదనే కారణంతో తాము చదువును నిర్లక్ష్యం చేయవద్దని, స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగాలని అన్నారు. చదువుతో పాటు ఆటలు ఆడాలని, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం 5, 6వ తరగతి విద్యార్థులు రాస్తున్న ఎస్ఏ-1 పరీక్షా హాల్‌ను కలెక్టర్ పరిశీలించారు. పరీక్షల నిర్వహణ తీరును, విద్యార్థుల హాజరు శాతాన్ని ఆరా తీశారు. పాఠశాల వంటగదిని సందర్శించి కూరగాయల నిల్వలు, విద్యార్థులకు అందిస్తున్న మెనూ వివరాలను పరిశీలించారు. స్టోర్ రూమ్‌ను తనిఖీ చేసి, అక్కడ పాఠశాల యూనిఫాంలు, బెడ్‌షీట్లు నిల్వ ఉంచిన తీరుపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.





ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సతీష్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు (హెచ్ఎం), ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రోవర్ సర్వేతో పకడ్బందీగా భూముల రీసర్వే

- అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ



**జడ్చర్ల, అక్టోబర్ 7 (జనంసాక్షి):** సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఆధునిక రోవర్ సర్వే ద్వారా ప్రతి భూమిని అత్యంత ఖచ్చితత్వంతో కొలవడంతో పాటు సరిహద్దులను స్పష్టంగా నిర్ధారిస్తామని మహబూబ్‌నగర్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి. హరిప్రియ తెలిపారు. బుధవారం జడ్చర్ల మండలం అమ్మపల్లి గ్రామంలో నిర్వహించిన భూముల రీసర్వే గ్రామసభ, అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని ఎంపిక చేసిన గ్రామాల్లో భూముల రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపడుతున్నట్లు చెప్పారు. రీసర్వే పూర్తయిన అనంతరం ప్రతి భూయజమానికి సంబంధిత ల్యాండ్ పార్సెల్ మ్యాప్స్ అందజేస్తామని, భవిష్యత్తులో భూ సరిహద్దులు, రెవెన్యూ రికార్డులకు సంబంధించి ఎలాంటి వివాదాలు తలెత్తకుండా పారదర్శకంగా ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రీసర్వే కార్యక్రమం సజావుగా, విజయవంతంగా పూర్తయ్యేందుకు గ్రామస్థులందరూ అధికారులకు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు (ఏడీ ఎస్ఎల్ఆర్), జడ్చర్ల తహసీల్దార్ నర్సింగ్ రావు, డిప్యూటీ తహసీల్దార్, మండల సర్వేయర్, ఇతర రెవెన్యూ అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మాజీ నాయకుడు విష్ణు కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి



**అమరచింత, అక్టోబర్ 7 (జనంసాక్షి):** బుధవారం నాడు కాంగ్రెస్ మాజీ ఎంపీటీసీ విష్ణు ఇటీవల మృతి చెందడంతో మంత్రి వాకిటి శ్రీహరి గారు విష్ణు కుటుంబ సభ్యులను పరామర్శించి ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేసి ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. విష్ణు కుటుంబానికి అండగా ఉంటానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీ టాడి టాపర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ కేశం నాగరాజ్ గౌడ్ మండల అధ్యక్షులు రాజేందర్ రెడ్డి పట్టణ అధ్యక్షులు రవికాంత్ జిల్లా కార్యదర్శి రమేష్ జిల్లా కార్యదర్శి తులసిరాజ్ మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా ఆత్మకూరు కాంగ్రెస్ మండల అధ్యక్షులు నాగేశ్వర్ పట్టణ అధ్యక్షులు శ్రీనివాసులు బంగారు భాస్కర్ వెంకట నరసింహారావు చిన్న కదుమూర్ జగన్ రెడ్డి భగవంతు రెడ్డి ధర్మపురం శ్రీను ఆప్షన్ సభ్యులు తోఫిక్ పామ్‌రెడ్డిపల్లి బీసీ రెడ్డి వెంకటయ్య రఫీ నరసింహ ఆనందు ఆయా గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ డీలర్ల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్తా

- ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



**జడ్చర్ల, అక్టోబర్ 7 (జనంసాక్షి):** రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ కళాభవన్‌లో నిర్వహించిన రేషన్ డీలర్ల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్వింటాల్ రేషన్‌కు రూ.300 కమిషన్ పెంపుతో పాటు, నెలకు రూ.5,000 గౌరవ వేతనం అందించాలనే డిమాండ్లను డీలర్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయాలను రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. నిత్యావసర సరుకులను ప్రజలకు అందిస్తున్న రేషన్ డీలర్ల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిని డీలర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం, జిల్లా రేషన్ షాపుల డీలర్ల సంఘం అధ్యక్షుడిగా ఎన్నం సత్యనారాయణ గుప్తా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాయకోటి రాజు, మాజీ అధ్యక్షుడు అన్వర్ పాషా, వివిధ మండలాల అధ్యక్షులు, ప్రతినిధులు మరియు 14 మండలాలకు చెందిన రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

# కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శిగా ఏల సురేందర్ రెడ్డి

- పదవీ బాధ్యతలు స్వీకరణ



**ఉప్పునుంతల (జనంసాక్షి):** భారతీయ జనతా పార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శిగా ఏల సురేందర్ రెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించారు. బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు వేముల నరేందర్ రావు ఆయనను జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శిగా నియమించగా, ఈ సందర్భంగా సురేందర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. మండల స్థాయిలో గత కొన్ని సంవత్సరాలుగా పార్టీకి వివిధ బాధ్యతల్లో పనిచేస్తూ క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా సురేందర్ రెడ్డి గుర్తింపు పొందారు. ఏబీవీపీ నాయకుడిగా, సంఘ కార్యకర్తగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. పార్టీ పట్ల ఆయన చూపుతున్న నిబద్ధతను గుర్తించిన జిల్లా నాయకత్వం కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించింది. పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఏల సురేందర్ రెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మకంతో జిల్లా పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. ఉప్పునుంతల మండలంలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. రైతుల సమస్యలను పార్టీ దృష్టికి తీసుకెళ్లి, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ పదవీ స్వీకరణ కార్యక్రమంలో మాజీ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజ్ ఆచారి, రాష్ట్ర కార్యదర్శి పోతుగంటి భరత్ ప్రసాద్, శ్రీశైలం దేవస్థానం కమిటీ ప్రత్యేక ఆహ్వానితులు కట్టా సుధాకర్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సోలంకి శ్రీనివాస్తో పాటు బీజేపీ జిల్లా నాయకులు పాల్గొని ఏల సురేందర్ రెడ్డికి అభినందనలు తెలిపారు.

# వికసిత్ భారత్ సంకల్ప సభ: ప్రధాని మోదీ ప్రసంగం వీక్షణ



**గద్వాల, అక్టోబర్ 07 (జనంసాక్షి):** గద్వాల పట్టణంలోని స్వర్ణకారుల ఫంక్షన్ హాల్ లో భాజపా జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప సభ, సేవా జ్యోతి యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా చేసిన ప్రసంగాన్ని నాయకులు ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా వీక్షించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథి, రాష్ట్ర కార్యదర్శి ఓ వైఎస్ రెడ్డి మాట్లాడుతూ.. గుజరాత్ సీఎంగా, దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను పూర్తి చేసుకుని భారతదేశాన్ని 'వికసిత్ భారత్' వైపు నడిపిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్ చార్జ్ బాపు రెడ్డి, యువ నాయకురాలు డీకే స్నిగ్ధ రెడ్డి, సేవా సంకల్ప్ జిల్లా కన్వీనర్ రవి ఎక్బోటే, భాజపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పౌష్టికాహారమే చిన్నారుల ఎదుగుదలకు పునాది

- ఐసీడీఎస్ ఆఫీసర్ రూప



**మహమ్మదాబాద్, అక్టోబర్ 07 (జనంసాక్షి):** మహమ్మదాబాద్ మండల పరిధిలోని నంచర్ల అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ అధికారిణి రూప ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు, గర్భిణీలు మరియు బాలింతలకు సమతుల పౌష్టికాహారం తప్పనిసరని ఆమె సూచించారు. రక్తహీనతను నివారించేందుకు ఆకుకూరలు, పాలు, పండ్లు, చిరుధాన్యాలు ఆహారంలో భాగం చేసుకోవాలని, ప్రభుత్వం అంగన్వాడీల ద్వారా అందిస్తున్న బాలామృతం ప్లస్‌ను క్రమం తప్పకుండా వాడాలని కోరారు. తల్లిపాల ప్రాముఖ్యత, పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తూ పోషకాహార పదార్థాల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పద్మ, మల్లమ్మ, ఉప సర్పంచ్ సుమిత్ర, పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యం..

- స్వచ్ఛమైన తాగునీటికి పెద్దపీట: ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి
- ఊర్కొండపేట పాఠశాలలో వాటర్ ఫిల్టర్ సెంటర్ ప్రారంభం



**ఊర్కొండ, అక్టోబర్ 07 (జనంసాక్షి);** ఊర్కొండ మండలం ఊర్కొండపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్ సెంటర్‌ను జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులకు స్వచ్ఛమైన, శుద్ధమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, సౌకర్యాల కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ రహీం, సర్పంచ్ అబ్దుల్ రషీద్,ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తా

- యువజన కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రటరీగా కంఠం విజయుడు



**ఉర్కొండ, అక్టోబర్ 07 (జనంసాక్షి);** మహబూబ్‌నగర్ జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శిగా ఉర్కొండ మండలానికి చెందిన కంఠం విజయుడు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి, ద్యాప నిఖిల్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విజయుడు జిల్లా కార్యదర్శిగా ఎన్నికవ్వడం పట్ల పలువురు నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

## బాలికా చైతన్యంతోనే నవసమాజ నిర్మాణం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ



**గద్వాల అక్టోబర్ 7 (జనంసాక్షి):** అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా గద్వాల తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నిష్కాపాత్రుడు బాలికల హక్కులు, చట్టపరమైన రక్షణ, ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. పోక్సో, బాల్య వివాహాల నిరోధక చట్టాలపై అవగాహన కల్పిస్తూ ఆత్మవిశ్వాసంతో చదువుకోవాలని సూచించారు. విద్యార్థినులు తమకు ఎలాంటి అన్యాయం లేదా వేధింపులు ఎదురైనా భయపడకుండా వెంటనే న్యాయ సహాయం పొందవచ్చని ఆయన స్పష్టం చేశారు. సమాజంలో బాలికల రక్షణ కోసం ప్రభుత్వం అందిస్తున్న వివిధ చట్టపరమైన వెసులుబాట్లను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని, బాలికలు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేలా నిరంతరం శ్రమించాలని పిలుపునిచ్చారు. సమాజంలో వేళ్లూనుకున్న మూఢనమ్మకాలు, బాల్య వివాహాల వంటి సామాజిక రుగ్మతలను రూపుమాపడంలో విద్యార్థులు చైతన్యవంతమైన పాత్ర పోషించాలని ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బందితో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

# రైతులకు నష్టం కలగకుండా భూసేకరణ సర్వే నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ ప్రియాంక

**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 7 (జనంసాక్షి):** జిల్లాలో జరిగే భూసేకరణ సర్వే ప్రక్రియలో రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా, భూ వివరాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, పారదర్శకంగా సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు.

బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు కోసం చేపడుతున్న భూసేకరణ ప్రక్రియ, సర్వే పురోగతిపై రెవెన్యూ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా భూసేకరణ సర్వే పురోగతి, పెండింగ్‌లో ఉన్న పనులు, ప్రభుత్వ భూముల గుర్తింపు తదితర అంశాలపై సమీక్షించారు. గుండుమాల్ గ్రామంలో భూసేకరణకు సంబంధించిన సర్వే పూర్తయినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. నాగిరెడ్డిపల్లి, లక్ష్మీపూర్ గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా భూ రికార్డులను పరిశీలిస్తూ క్షేత్రస్థాయిలో ఖచ్చితమైన వివరాలు నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. కోస్గి, దామరగిద్ద మండలాల్లో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులను వేగవంతం చేయాలని, మద్దూరు మండలంలోని మూడు గ్రామాల్లో సర్వే పూర్తయినందున తదుపరి ప్రక్రియను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రేడియల్ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన భూసేకరణకు ప్రాధాన్యత నిస్తూ పేరపళ్లలో సర్వే ప్రక్రియను ప్రారంభించాలని సూచించారు.

భూసేకరణకు సంబంధించి జనరల్ అవార్డు ప్రక్రియను నిబంధనల మేరకు పూర్తిచేయాలని, మద్దూరు, కోస్గి, కొత్తపల్లి ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను గుర్తించి వివరాలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు అవసరమైన భూమిని గుర్తించి ల్యాండ్ రిపోర్టులను సమర్పించాలని తహసీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. రీ-సర్వే అవసరమైన గ్రామాల్లో నిబంధనల ప్రకారం జనరల్ నోటీసులు జారీ చేసి, సంబంధిత రిజిస్టర్లను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ప్రతి మండలంలో రెండు గ్రామాలను ప్రాధాన్యతగా ఎంపిక చేసి రీ-సర్వే చేపట్టేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, సర్వేకు సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లు, భూ వివరాలను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. భూసేక



రణకు సంబంధించిన రోజువారీ పురోగతి నివేదికను అదనపు కలెక్టర్ ఏర్పాటు చేసిన గ్రూపులో తప్పనిసరిగా సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ కేసులను త్వరితగతిన పరిష్కరించి, అభివృద్ధి పనులకు అవసరమైన భూమి సేకరణ ప్రక్రియను నిబంధనల మేరకు పూర్తి చేయాలని సూచించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను, ఆర్డీఓ రమేష్, ఏవో అనిల్ కుమార్, జిల్లా సర్వే ల్యాండ్ అధికారి గోవింద్, ఉద్యాన శాఖ అధికారి సాయిబాబా, నారాయణపేట ఉట్కూర్, దామర గిద్ద, మద్దూరు, గుండు మల్, కోస్గి తహసీల్దార్లు అమరేంద్ర కృష్ణ, అశోక్ కుమార్, తిరుపతయ్య, మహేష్, భాస్కర స్వామి, కళ్యాణి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# ఆత్మకూర్ మున్సిపాలిటీలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

**ఆత్మకూర్, అక్టోబర్ 7 (జనంసాక్షి):** ఆత్మకూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మున్సిపల్ చైర్ పర్సన్ జీ. నాగమణి అధ్యక్షత వహించగా, మున్సిపల్ కమిషనర్ ఎ. నరేష్ కుమార్ ఆధ్వర్యంలో సమావేశం కొనసాగింది.

పట్టణ అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, ఆస్తి పన్ను వసూళ్లు, మున్సిపల్ ఆదాయ వనరులు, ప్రజలకు అందుతున్న మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. కౌన్సిలర్లు తమ వార్డుల్లోని ప్రజా సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా చైర్‌పర్సన్ జీ.నాగమణి మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పట్టణాన్ని పరిశుభ్రంగా, అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కౌన్సిల్ సభ్యులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ప్రజా సమస్యలకు ప్రాధాన్యతనిచ్చి పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. వైస్ చైర్మన్ ఎం. శ్రీనివాసులు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ అభివృద్ధికి కౌన్సిలర్లు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలని, ప్రతి వార్డులో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. కమిషనర్ ఎ. నరేష్ కుమార్ మాట్లాడుతూ.. కౌన్సిల్



సభ్యులు సూచించిన సమస్యలను పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరిస్తామని, పారిశుధ్యం, పన్నుల వసూళ్లు, తాగునీరు, వీధి దీపాలు తదితర సేవలను మరింత మెరుగుపరుస్తామని తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# వికసిత భారత్ కోసం ప్రధానికి వెన్నుదన్నుగా నిలుద్దాం: ఎమ్మెల్సీ ఏవిఎన్ రెడ్డి

**నారాయణపేట జిల్లా బ్యూరో అక్టోబర్ 7 (జనంసాక్షి):** వికసిత భారత్ 2047 వరకు ప్రధాని నరేంద్రమోడీకి ప్రజలంతా వెన్ను దన్నుగా నిలవాలని ఎమ్మెల్సీ ఏవిఎన్ రెడ్డి కోరారు. బుధవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు ప్రధాని నరేంద్రమోడీ 25 ఏళ్ల ప్రజాసేవ పూర్తి చేసుకున్న సందర్భంగా వికసిత భారత్ సంకల్ప సభలో భాగంగా పట్టణంలో భారీ కాగడాల ప్రదర్శన ర్యాలీ నిర్వహించా రు. అనంతరం ఎస్ ఆర్ గార్డెన్ లో డిజిటల్ తెరపై ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఏవిఎన్ రెడ్డి మాట్లాడుతు ప్రధాని నరేంద్రమోడీ 13 ఏళ్లు గుజరాత్ సిఎంగా 12 ఏళ్లు భారత ప్రధానిగా ప్రజాసేవలో ఉండడం గర్వకారణమని అన్నారు. 12 ఏళ్లలో ప్రధాని నరేంద్రమోడీ భారత దేశాన్ని



ప్రపంచ దేశాల సరసన నిలబెట్టారు అని అన్నారు. అన్ని రంగాల్లో అభివృద్ధితో పాటు ప్రజాసంక్షేమం లో మచ్చలేని ప్రధానిగా నిలిచారన్నారు. దేశాన్ని 2047 నాటికి విశ్వగురు స్థానంలో నిలబెట్టాలని పట్టుదలతో ఉన్నారని అన్నారు. అలాంటి ప్రధానికి దేశ ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. కానీ ప్రతిపక్షాలకు అధికారం పగటికలగా భావించి సర్ పేరుతో అసత్య ప్రచారం ఆందోళనలు చేస్తున్నాయని విమర్శించారు. వారి ఆరోపణల్లో విశ్వసనీయత లేదని అన్నారు. కాంగ్రెస్ కూటమి పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని



పిలుపు ఇచ్చారు. రాష్ట్రంలో రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను గెలిపించి బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు కే. రతంగ్ పాండు రెడ్డి, బి.కొండయ్య, జిల్లా బిజెపి అధ్యక్షుడు సత్య యాదవ్,ప్రధాన కార్యదర్శులు లక్ష్మి శ్యామ్ సుందర్ గౌడ్, బలరామ్రెడ్డి,తిరుపతి రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కొండాశ్వేత సత్య యాదవ్,వైస్ చైర్మన్ మంజుల జి ఆర్ రెడ్డి,కౌన్సిలర్ల బిజెపి పట్టణ అధ్యక్షుడు పోషల్ వినోద్, జిల్లా, మండల పట్టణ నాయ కులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పురాతన దేవాలయాలను కాపాడుకోవడం మన బాధ్యత: ఆర్కియాలజిస్ట్ శివనాగిరెడ్డి

**రాజాపూర్, అక్టోబర్ 7(జనంసాక్షీ):** మండల పరిదిలోని ఖానాపూర్ గ్రామంలో చిత్తనూరి రవికుమార్ వ్యవసాయ క్షేత్రంలో నిర్మిస్తున్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ ఆర్కిటెక్చర్ పలు కట్టడాలపై ప్రముఖ ఆర్కియాలజిస్ట్, చరిత్ర పరిశోధకులు శివనాగిరెడ్డి బుధవారం సందర్శించారు. అనంతరం రంగారెడ్డి గూడ గ్రామంలో ఉన్న హనుమాన్ దేవాలయం శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయాలను సందర్శించి పలు సూచనలు చేశారు



**ఆలయాల అభివృద్ధికి సూచనలు...**

పురాతన దేవాలయాలను కాపాడుకోవడం మన బాధ్యత అని ఈ సందర్భంగా శివనాగిరెడ్డి అన్నారు. దేవాలయాల చుట్టూ ఉన్న పురాతన శిల్పాలకు ఎలాంటి నష్టం కలగకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని, ఆలయాల చరిత్రను తెలిపే విధంగా సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలని సలహాలు, సూచనలు చేశారు.

ఆలయాలకు పురావస్తుశాఖ ద్వారా గుర్తింపు తీసుకు వచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఆలయ కమిటీ సభ్యులు చిత్తనూరీ,రవి కుమార్ దంపతులు, వినోద్ కుమార్ దంపతులు, కృష్ణ కూమారీ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శేఖర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

# వార్డు సమస్యలకు ఇక సత్వర పరిష్కారం!

- ప్రజలకు చేరువగా వార్డు కార్యాలయాలు
- దసరాలోపు మిగిలిన వార్డుల్లోనూ ఏర్పాటు
- మున్సిపల్ చైర్ పర్సన్ భృంగి రత్నమాల ఆనంద్ కుమార్

**కల్వకుర్తి, అక్టోబర్ 7 (జనంసాక్షి):** కల్వకుర్తి మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ముందుకు సాగుతున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ భృంగి రత్నమాల ఆనంద్‌కుమార్ అన్నారు.ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడంతోపాటు వార్డుల వారీగా సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని 7,20,21, 9,10వ వార్డుల్లో ఇటీవల ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాలను చైర్‌పర్సన్ భృంగి రత్నమాల ఆనంద్‌కుమార్ స్థానిక కౌన్సిలర్లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. ముఖ్యంగా పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధిదీపాల నిర్వహణ తదితర అంశాలపై అధికారులు, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.



**ఫిర్యాదులపై తక్షణ స్పందన...**

ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా వార్డు కార్యాలయాల ద్వారా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తామని చైర్‌పర్సన్ పేర్కొన్నారు.

**అన్ని వార్డుల్లో వార్డు కార్యాలయాలు...**

కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని మిగిలిన వార్డుల్లోనూ దసరా పండుగలోపు వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేస్తామని భృంగి రత్నమాల ఆనంద్‌కుమార్ తెలిపారు.ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, కల్వకుర్తి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు, నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనం విజయవంతం చేసిన అధికారులకు మంత్రి శ్రీహరి సన్మానం

**మక్తల్, అక్టోబర్ 07 (జనంసాక్షి):** మక్తల్ పట్టణంలో వినాయక నిమజ్జన వేడుకలను అత్యంత వైభవంగా, ప్రశాంతంగా నిర్వహించిన వివిధ శాఖల అధికారులను, సిబ్బందిని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ఘనంగా సన్మానించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారికి శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి అభినందించారు.

**ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..** ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు అంకితభావంతో, సమన్వయంతో పనిచేశారని కొనియాడారు. ప్రభుత్వ యంత్రాంగం, ఉత్సవ కమిటీలు, ప్రజల సమష్టి కృషితోనే గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా ముగిసిందని పేర్కొంటూ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, నాయకులు పాల్గొన్నారు.



## గంజాయి సరఫరాపై పోలీసుల నిఘా

**కొల్చారం, అక్టోబర్ 07 (జనంసాక్షి):** మండల కేంద్రమైన కొల్చారంలో గంజాయి సరఫరా చేస్తున్నారన్న ప్రాథమిక సమాచారంతో కొల్చారం పోలీసులు నిఘా ముమ్మరం చేసినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై పోలీసులు లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సమాచారం.

విషయం తెలుసుకున్న మెదక్ రూరల్ సీఐ కొల్చారం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే ఘటనకు సంబంధించి పోలీసులు ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. అధికారిక ప్రకటన వెలువడితే గంజాయి సరఫరా వెనుక ఉన్న వ్యక్తులు వెల్లడయ్యే అవకాశం ఉంది.

ఇంకుడు గుంతల నిర్మాణ కార్యక్రమం ప్రారంభం

## ఇంకుడు గుంతల నిర్మాణ కార్యక్రమం ప్రారంభం



**కొండాపూర్, అక్టోబర్ 7 (జనంసాక్షి):** కొండాపూర్ మండలం గంగారం గ్రామంలో ఇంకుడు గుంతల కార్యక్రమాన్ని సర్పంచ్ సరిత అశోక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షపాతం తగ్గడంతో రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని, ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఇంకుడు గుంతలు ఎంతో ఉపయోగపడతాయని, ప్రతి ఒక్కరూ వీటిని నిర్మించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంతోష్ శేఖర్, కార్యదర్శి మంజుల పాల్గొన్నారు.

## కాలేయ వ్యాధిగ్రస్తులకు ఉచిత ఫైబ్రో స్కాన్

**నాగర్‌కర్నూల్, అక్టోబర్ 7 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో గల శ్రీ మణికంఠ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నందు కాలేయ వ్యాధిగ్రస్తులకు, లివర్ సమస్య ఉన్నవారికి ఈనెల 8న గురువారం నాడు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉచితంగా ఫైబ్రో స్కాన్ నిర్వహిస్తున్నట్లు, గ్యాస్ట్రాలజీ స్పెషలిస్ట్ డాక్టర్ మణికంఠ జగదీష్ తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లాలోని లివర్ సమస్య ఉన్నవారు, షుగర్ వ్యాధిగ్రస్తులు, మద్యపానం అలవాటు ఉన్నవారు, ఫ్యాటీ లివర్ ఉన్నవారు, ధూమపానం అలవాటు ఉన్నవారు తప్పనిసరిగా పాల్గొని ఉచితంగా 5వేల రూపాయలు విలువగల ఫైబ్రో స్కాన్‌ను ఉచితంగా చేయించుకోవాలని ఆయన తెలిపారు. రోగులు, వ్యాధి అనుమానితులు సెల్ నెంబర్ 9885880155, 9885880166 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.



## ఆత్మకూర్ పరమేశ్వరస్వామి ఆలయానికి రూ. కోటితో బ్రిడ్జి నిర్మాణం

**ఆత్మకూర్, అక్టోబర్ 7(జనంసాక్షి):** ఆత్మకూర్ మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన చెరువు మధ్యలో కొలువైన శ్రీ చెర్ల పరమేశ్వరస్వామి ఆలయానికి భక్తులు సులభంగా చేరుకునేందుకు రూ.1 కోటి నిధులతో చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రోడ్డు నుంచి ఆలయం వరకు మట్టి కట్టతో కూడిన బ్రిడ్జిని నిర్మించనున్నారు. ఈ పనులను మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా, మున్సిపల్ చైర్ పర్సన్ నాగమణి, వైస్ చైర్మన్ నల్గొండ శ్రీనివాసులు, రాయిచూర్ పరమేష్, తులసి రాజు యాదవ్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి కృషి ఫలితంగానే ఈ అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న ఈ బ్రిడ్జి పనులను రెండు నెలల్లోపు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టూరిజం శాఖ ఏఈ నరేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నాగేశ్వర్, టౌన్ అధ్యక్షులు ఈర్లదిన్నె శ్రీనివాసులు, కొత్తూరు వెంకటేష్, పిన్నంచర్ల భాజన్న, వడ్డే చిన్నన్న, కత్తెపల్లి రాములు, కురువ విష్ణు, కరణ్ లాల్, సాయి రాఘవ, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలి

- డిఆర్‌డిఓసిహెచ్. శ్రీనివాస్ రావు




**కొల్చారం, అక్టోబర్ 07 (జనంసాక్షి):** ఉపాధి హామీ పనులను వేగవంతం చేసి కూలీల సంఖ్యను పెంచాలని డీఆర్‌డీఓ సిహెచ్. శ్రీనివాస్ రావు అధికారులను ఆదేశించారు. బుధవారం కొల్చారం మండల కేంద్రంలో అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వి.బి.-జి రాంజీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాబోయే రోజుల్లో ఉపాధి హామీ పనులకు మరింత ప్రాధాన్యత ఇచ్చి కూలీల హాజరు పెంచాలని సూచించారు. అదేవిధంగా జలసిరి పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఫీక్ ఉన్నిసా, ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్లు, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## రాచూర్ విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేకు వినతి

- 11 కేవీ లైన్ మార్పు, నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు విజ్ఞప్తి



**వెల్దండ, అక్టోబర్ 07 (జనంసాక్షి):** రాచూర్ గ్రామంలో కొన్నేళ్లుగా నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాచూర్‌కు చెందిన యువ నాయకులు పడకంటి వెంకటేష్, గుత్తి చంద్రశేఖర్ బుధవారం హైదరాబాద్‌లో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రామంలోని ఇళ్లపై నుంచి, ప్రాథమిక పాఠశాల సమీపంలో ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్‌ను సురక్షిత ప్రాంతానికి మార్చాలని కోరారు. అలాగే పాఠశాల పక్కన ఉన్న విద్యుత్ బుడ్డీని మార్చడంతో పాటు గ్రామంలోని పాత విద్యుత్ స్తంభాల స్థానంలో 40 నూతన స్తంభాలను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.వినతిపై స్పందించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి వెంటనే విద్యుత్ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిశీలించి, పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు.

## 2008 స్పెషల్ టీచర్లకు ఎస్‌జిటి స్కేల్ వర్తింపజేయాలి

- టిపిటిఎఫ్ స్టేట్ కౌన్సిలర్ వి.సంగయ్య




**కొల్చారం, అక్టోబర్ 07 (జనంసాక్షి):** 2008 స్పెషల్ టీచర్లకు ఎస్‌జిటి స్కేల్ వర్తింపజేయాలని టిపి టిఎఫ్ స్టేట్ కౌన్సిల్ వి.సంగయ్య, ఎండి నజీరుద్దీన్‌లు ప్రభుత్వాన్ని కోరారు. మండల సభ్యత్వ కార్యక్రమంలో భాగంగా రాంపూర్, తు క్కాపూర్, చిన్న ఘనాపూర్, కోనాపూర్, ఎన గండ్ల పాఠశాలలను బుధవారం సందర్శించారు.

**ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..** పి ఆర్ సి 50 శాతం ఫిట్‌మెంట్ తో వెంటనే ప్రకటించాలని ప్రభుత్వం ప్రతినెల విడుదల చేసే 2000 ల కోట్ల బకాయి నిధులను గత రెండు మాసాల నుండి విడుదల చేయటం లేదని పెండింగ్ బిల్లు డబ్బులు రాక ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర మానసిక వేదనతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని, బడ్జెట్‌ను వెంటనే మంజూరీ చేయాలని జీవో 25 ను రద్దుచేసి ఎస్టీటీ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. 317 జీవో బాధితుల సమస్యను సత్వరమే పరిష్కరించాలని కేజీబీవీ ఉద్యోగుల కనీస వేతనం 60 వేలకు పెంచాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. సిపిఎస్ విధానాలు రద్దుచేసి ఓపిఎస్‌ను వర్తింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ కొల్చారం మండల ప్రధాన కార్యదర్శి పి .యాదగిరి పాల్గొన్నారు.

## లక్ష్మీపూర్‌లో ఉచిత వైద్య శిబిరం

- 200 మందికి పైగా వైద్య పరీక్షలు



**బెజ్జంకి, అక్టోబర్ 7 (జనంసాక్షి):** మండలంలోని లక్ష్మీపూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ ముక్కిస కవితరత్నాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఐరా అకీర హాస్పిటల్ సౌజన్యంతో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు దిలీప్ రెడ్డి, శ్రీలక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో 200 మందికి పైగా బీపీ, షుగర్, మూత్రం, థైరాయిడ్ పరీక్షలు నిర్వహించి,అవసరమైన వారికి మందులు అందజేసి వైద్య సలహాలు అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని శిబిరం ఏర్పాటు చేశాము అని అన్నారు. వైద్యులు, సిబ్బందికి గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గంగాధర హరీష్,వార్డు సభ్యులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అధిక ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోండి

• వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్





**మహబూబ్‌నగర్, బ్యూరో అక్టోబర్ 07 (జనం సాక్షి):** వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తుల ద్వారా రైతులు అధిక ఆదాయం పొందేలా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల కార్యదర్శి కె. సురేంద్ర మోహన్ ఆదేశించారు. మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఇతర అధికారులతో కలిసి వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్, సహకార శాఖల సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లాలో ఎల్ నినో ప్రభావంతో 31 శాతం వర్షపాత లోటు నమోదైందని, సాగు విస్తీర్ణం తగ్గడంతో ఆరుతడి, ఉద్యాన పంటల వైపు రైతులను మళ్లించినట్లు అధికారులు ఆయనకు వివరించారు. అనంతరం సమీక్షలో సురేంద్ర మోహన్ మాట్లాడుతూ పలు కీలక సూచనలు చేశారు:

**ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు:** అక్టోబర్ చివరి నుంచి ప్రారంభమయ్యే ధాన్యం కొనుగోళ్లకు పూర్తి ఏర్పాట్లు చేయాలి. సన్నరకం వరి ధాన్యానికి ఇచ్చే బోనస్ గుర్తింపు కోసం అగ్రికల్చర్ డిప్లొమా, బీఎస్సీ అభ్యర్థులను కొనుగోలు కేంద్రాల్లో నియమించాలని, వివరాల ప్రదర్శన బ్యానర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

**'పాలమూరు బ్రాండ్' ఏర్పాటు:** జిల్లా హైదరాబాద్ కు సమీపంలో ఉన్నందున 17 రైతు ఉత్పత్తి సంఘాల (FPO) ద్వారా మార్కెటింగ్, ఎగుమతులకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. 'పాలమూరు బ్రాండ్' పేరుతో రైతు సంఘాలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలని, బయ్యర్స్-సెల్లర్స్ మీటింగ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. వీటి అభివృద్ధికి బీజనజ ద్వారా రూ. 2 కోట్ల వరకు రుణం పొందే అవకాశముందని తెలిపారు.

**ఫార్మర్ ఐడీ & ప్రకృతి వ్యవసాయం:** సబ్సిడీలు, ఎరువుల పంపిణీకి ఫార్మర్ ఐడీ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఆయిల్ పామ్, మల్బరీ, కూరగాయల సాగుతో పాటు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, బయో రీసోర్స్ సెంటర్లను బలోపేతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ హరిప్రియ, డీఆర్‌ఓ నిర్మల, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, ఉద్యాన అధికారి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత



**తెలకపల్లి, అక్టోబర్ 7 (జనంసాక్షి):** ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న టిప్పర్ ను పట్టుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. బుధవారం ఈ సందర్భంగా స్థానిక ఎస్సై యం రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రామగిరి నుంచి తెలకపల్లి వైపు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను తనిఖీల్లో భాగంగా పట్టు కున్నట్లు తెలిపారు. పట్టుబడిన టిప్పర్ నంబర్ ఏపీ-09-టీఎన్-4005 కాగా, అది తిమ్మాజిపేట మండలం నేరెళ్లపల్లి గ్రామానికి చెందిన మల్లేష్‌కు చెందినదిగా పోలీసులు గుర్తించారు. ఇసుక రవాణాకు ఎలాంటి అనుమతులు లేకపోవడంతో టిప్పర్‌పై కేసు నమోదు చేసి, నిబంధనల ప్రకారం జరిమానా విధించేందుకు మండల తహసీల్దార్‌కు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

## కుచినెర్లలో ఉచిత పశువైద్య శిబిరం



**కే.టీ.దొడ్డి అక్టోబర్ 07(జనంసాక్షి):** కే.టీ. దొడ్డి మండలం కుచినెర్లలో పశుసంవర్థక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్సలు, కృత్రిమ గర్భధారణ సేవలు అందించడమే కాకుండా దూడలకు నట్టల మందులు, మినరల్ మిక్చర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. మండల పశు వైద్యాధికారి డాక్టర్ వినయ్ కుమార్ మాట్లాడుతూ పశువుల పెరుగుదలకు క్రమం తప్పకుండా డీవార్మింగ్ చేయించాలని, పాల దిగుబడి పెంచేందుకు పచ్చి మేత సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె. కృష్ణ, సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

## రామాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలో తీవ్ర కరెంట్ కోతలు

### బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు



**రామాయంపేట, అక్టోబర్ 07 (జనంసాక్షి):** రామాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలో కొనసాగుతున్న తీవ్ర విద్యుత్ కోతలు, లో-వోల్టేజ్ సమస్యతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు అన్నారు. ప్రస్తుతం రైతులు సాగు చేసిన పంటలు తుది దశకు చేరుకున్నాయని, మరో 20 రోజులు పంటలకు నిరంతరంగా నీరు అందితే పంటలు చేతికొచ్చే అవకాశం ఉందని తెలిపారు. అయితే రామాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలో తరచూ విద్యుత్ కోతలు విధించడం, లో-వోల్టేజ్ సమస్యలు తలెత్తడం వల్ల పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

గంట, రెండు గంటలకు ఒకసారి, కొన్ని సందర్భాల్లో అరగంటకే విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ముఖ్యంగా లో-వోల్టేజ్ కారణంగా వ్యవసాయ మోటార్లు కాలిపోయే ప్రమాదం కూడా ఉందని అన్నారు.

ఈ సమస్యపై ఇప్పటికే మెదక్ పార్లమెంట్ సభ్యులు శ్రీ మాధవనేని రఘునందన్ రావు గారు విద్యుత్ శాఖ ఎస్సీని ఫోన్ ద్వారా సంప్రదించి సమస్యను పరిష్కరించాలని కోరారని రాగి రాములు తెలిపారు. అలాగే స్థానిక సబ్‌స్టేషన్ ఏఈ తిరుపతిరెడ్డి గారిని కూడా ఫోన్ ద్వారా సంప్రదించి రైతులకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని కోరినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అక్కన్నపేట గ్రామ సర్పంచ్ బక్కయ్య గారు, యాదగిరి, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మెంగర్తి రంగయ్య, కిసాన్ మోర్చా నాయకులు రాగి అనిల్ కుమార్, సున్నం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ జీ ఎఫ్ అండర్-19 వాలీబాల్ టోర్నమెంట్ ఏర్పాట్లు ముమ్మరం



**రాజాపూర్, అక్టోబర్ 7(జనంసాక్షి):** రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడలో ఈ నెల 9 నుంచి 11 వరకు ఎస్ జీ ఎఫ్ అండర్-19 వాలీబాల్ టోర్నమెంట్ కమ్ సెలెక్షన్స్ నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ పోటీలకు ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్దరెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి హాజరుకానున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పాల్గొనే క్రీడాకారులకు ఇబ్బందులు లేకుండా మైదానాన్ని సిద్ధం చేస్తున్నామని ఆర్గనైజర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఏ కోచ్ పర్వేజ్ పాషా, క్రీడాకారులు పాల్గొని ఏర్పాట్లను పరిశీలించారు.

## రైతు నిర్లక్ష్యం

• ధ్వంసమైన రహదారి వాహనదారుల నరకయాతన • పట్టించుకోని అధికారులు



**మిడ్జిల్, అక్టోబర్ 7 (జనంసాక్షి):** మండల పరిధిలోని వేముల గ్రామ శివారులో వాడ్యాల గేటు నుండి మసిగుండ్లపల్లి పోయే ప్రధాన రహదారి రైతు నిర్లక్ష్యం వల్ల రహదారి పూర్తిగా దెబ్బతింది. రహదారిపైకి నీరు చేరడం వల్ల రోడ్డు ధ్వంసం కావడంతో వాహనదారులు తీవ్ర ఇరుబందుల పాలు అవుతున్నారు. గుంతలమయంగా మారిన ఈ రోడ్డుపై ప్రయాణించడం ప్రాణసంకటంగా మారింది. ముఖ్యంగా రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రైతు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ గత కొంతకాలంగా పైపులైన్ లీకేజీ రోడ్డుపై నీరు చేరుతున్నప్పటికీ నిమ్మకు నీరు తిన్నట్లు వ్యవహరిస్తూ రహదారిపై వెళ్తున్న వాహనదారుల ప్రమాదాలకు కారణమవుతున్నారు. రోడ్డు ఇంతలా పాడైపోయి, నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు మాత్రం స్పందించడం లేదు. కనీసం పరిశీలనకు కూడా రాకపోవడంపై స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి, ధ్వంసమైన రహదారికి మరమ్మతులు చేపట్టాలని, ఇందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకొని ప్రయాణాన్ని సురక్షితం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## పేచులు ఊడిపోతున్న పశు ఆసుపత్రి భవనం





**మల్దకల్, అక్టోబర్ 7 (జనంసాక్షి):** మండల పరిధిలోని మద్దెలబండ గ్రామంలో పశుసంవర్ధక శాఖ పశు వైద్య ఉప కేంద్రము భవనం పేచులు ఊడిపడి శిథిలావస్థకు చేరుకుంది. కొన్ని సంవత్సరాల నుండి ఇదే భవనంలో గొర్రెలు, మేకలు, పశువులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పుడు వాటర్ షెడ్డు కింద నిర్మించారు. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి ఉండడంవల్ల పశు వైద్య సిబ్బంది బిక్కుబిక్కుమంటూ తమ విధులను నిర్వర్తిస్తున్నారు. గ్రామస్తులు కూడా పట్టించుకోకపోవడంతో ఉన్నతాధికారులు మాకేం పట్టినట్లుగా వ్యవహరించడం వల్ల భవనము శిథిలావస్థ చేరుకుంది. మండలంలోని ఎల్కూరు, బిజ్వారం తదితర గ్రామాలలో భవనాలు పూర్తిస్థాయిలో పడిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ఈ గ్రామాలలో నూతన భవనాలను నిర్మించి పశువులు,గొర్రెలు మేకలకు వైద్య సేవలు సక్రమంగా అందుతాయని గ్రామస్తులు ఆశిస్తున్నారు. సిబ్బంది కొరత కూడా ఉండడం వల్ల పశువులకు సక్రమంగా వైద్యము అందించి పశు పోషణను పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## ఎయిడ్స్‌పై అవగాహన కోసం రెడ్ రన్ కార్యక్రమం



**నారాయణపేట, అక్టోబర్ 7 (జనంసాక్షి):** హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించడం, హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యక్తుల పట్ల వివక్షను నివారించడం,ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం లక్ష్యంగా రెడ్ రన్ కార్య క్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రెడ్ రన్‌లో ,విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్య క్రమం ద్వారా "హెచ్ఐవీపై అవగాహన - వివక్షకు దూరం" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. హెచ్ఐవీ వ్యాప్తి నివారణకు సురక్షితమైన జీవన విధా నాన్ని పాటించాలని, అను మానం ఉన్నప్పుడు సమీ పంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో హెచ్ఐవీ పరీక్షలు మరియు కౌన్సెలింగ్ పొందాలని అధికారులు సూచించారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వారికి సమాజం అండగా నిలవాలని, వారి పట్ల ఎలాంటి వివక్ష చూప కూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్.మెర్సీ వసంత, డాక్టరు.సీ హెచ్ శంకర్.ప్రోగ్రామ్ ఆఫీసర్ హెచ్ ఐ వి,టీబీ డాక్టర్.సత్యప్రకాశ్ రెడ్డి, శ్రీధర్ టీబీ కో ఆర్డినే టర్.యన్ సి సి.విద్యార్థు లు,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, పాల్గొన్నారు.

## ఉపన్యాస పోటీల్లో విద్యార్థిని కీర్తనకు ద్వితీయ బహుమతి



**వీపనగండ్ల, అక్టోబర్ 8 (జనంసాక్షి):** యంగ్ టూరిజం క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఉపన్యాస పోటీలలో వీపనగండ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని పి. కీర్తన ద్వితీయ స్థానం సాధించింది. వనపర్తి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె. నరేంద్ర కుమార్ చేతుల మీదుగా ఆమెకు షీల్డ్, సర్టిఫికెట్, నగదు బహుమతి అందజేసి సన్మానించారు. తెలంగాణ పర్యాటక రంగ విశేషాలపై ప్రతిభ చూపిన కీర్తనను, ఆమెకు ప్రోత్సాహమందించిన ప్రిన్సిపాల్ బి. శివగౌడ్, అధ్యాపక బృందాన్ని కళాశాల సిబ్బంది అభినందించారు.

# వేరుశనగ రైతులకు డీకార్టికేటర్‌తో ప్రయోజనం

## యంత్రం పనితీరును పరిశీలించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

**ఉప్పునుంతల (జనంసాక్షి):** ఉప్పునుంతల మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (PACS) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డీకార్టికేటర్ (వేరుశనగ పొట్టు తొలగించే) యంత్రాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, అచ్చంపేట సబ్‌కలెక్టర్ సలోని చాబ్రాతో కలిసి బుధవారం స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా యంత్రం పనితీరు, శుభ్రపరిచే సామర్థ్యం, ఒకేసారి ఎంత పరిమాణంలో గింజలను వేరు చేయగలదనే అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పలు కీలక విషయాలు వెల్లడించారు:



శ్రమ, సమయం ఆదా: సాంప్రదాయ పద్ధతుల్లో వేరుశనగ కాయల నుంచి గింజలను వేరు చేయడానికి రైతులకు ఎక్కువ సమయం, శ్రమ వెచ్చించాల్సి వచ్చేదని, డీకార్టికేటర్ యంత్రం అందుబాటులోకి రావడం వల్ల చిన్న, సన్నకారు రైతులకు పంట అనంతర పనుల్లో ఎంతో సమయం ఆదా అవుతుందని తెలిపారు. యాంత్రీకరణ ప్రోత్సాహం: వ్యవసాయంలో యాంత్రీకరణ సేవలను రైతులకు మరింత చేరువ చేయడం ద్వారా ఆధునిక సాగు పద్ధతులను ప్రోత్సహించవచ్చని పేర్కొన్నారు.

**విస్తృత ప్రచారం:** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా అందుబాటులోకి తెచ్చిన ఈ యంత్ర సేవలను రైతులు సద్వినియోగం చేసుకునేలా గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మద్దు నరేందర్ రెడ్డి, సీఈఓ రవీందర్ రావు, తహశీల్దార్ అర్ధంకి సునీత, ఎంపీడీవో వరుణ్ తేజ్, మండల వ్యవసాయ అధికారి రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.





## భూముల రీ-సర్వే ను పరిశీలించినజిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వినోద్ కుమార్

**వీపనగండ్ల,అక్టోబర్ 8(జనంసాక్షి):** మండలంలోని కొర్లకుంట గ్రామంలో కొనసాగుతున్న రీ-సర్వే ప్రక్రియను వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామంలో చేపడుతున్న భూముల రీ- సర్వేలో భాగంగా గ్రామ సరిహద్దులు, ఆబాది ప్రాంతం, ప్రభుత్వ భూములు,చెరువులు,పట్టా భూములు,హౌస్ సైట్లకు సంబంధించిన వివరాలను ఆయన పరిశీలించి, అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ మాట్లాడుతూ రీ-సర్వేలో భూమి విస్తీర్ణంలో తేడాలు, ఎక్కువ లేదా తక్కువగా నమోదయ్యే సందర్భాల్లో సంబంధిత విషయాలను వెంటనే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు.అలాగే అధికారులు నిర్వహిస్తున్న కో-రిలేషన్ రిజిస్టర్, ఫీల్డ్ రిజిస్టర్లో నమోదు చేస్తున్న వివరాలను అదనపు కలెక్టర్ పరిశీలించారు.సర్వే సందర్భంగా సంబంధిత భూయజమానులకు తప్పనిసరిగా నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.రైతుల పట్టాదారు పాస్‌బుక్ నంబర్, ఆధార్ నంబర్లను నమోదు చేయడంతో పాటు సంబంధిత రిజిస్టర్లలో రైతుల సంతకాలను తీసుకోవాలని సూచించారు.రీ-సర్వే ప్రక్రియలో ఎలాంటి అలసత్వానికి తావులేకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, ఖచ్చితత్వంతో సర్వేను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉదయం, సాయంత్రం వేళల్లో సర్వే పనులను ఎక్కువగా నిర్వహించేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ రీ-సర్వేను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ గద్దం శివకుమార్,గ్రామ పాలన అధికారి రమేష్, లైసెన్స్‌డ్ సర్వేయర్ స్వామి, గ్రామ సర్పంచ్,మాజీ ఎంపీపీ కమలేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.





## వికసిత్ భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: బొక్క బాల్‌రెడ్డి



**వనపర్తి, అక్టోబర్ 7 (జనంసాక్షి):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా వనపర్తి రాజీవ్ చౌరస్తాలో భాజపా జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ ఆధ్వర్యంలో 'వికసిత్ భారత్ సంకల్ప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని వర్చువల్ ప్రసంగాన్ని ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా వీక్షించారు.

ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన భాజపా జిల్లా ఇన్‌చార్జి బొక్క బాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నారాయణ మాట్లాడారు. 2001 అక్టోబర్ 7న గుజరాత్ సీఎంగా ప్రారంభమైన మోదీ సేవలు పాతికేళ్లు పూర్తవడం సువర్ణాధ్యాయమని పేర్కొన్నారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా, స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా మోదీ పనిచేస్తున్నారని, దీని సాధనకు 140 కోట్ల మంది భాగస్వామ్యం అవసరమని పిలుపునిచ్చారు.

మోదీ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో నాలుగో స్థానానికి చేరిందని, జన్‌ధన్, ఉజ్వల, పీఎం కిసాన్, ఉచిత రేషన్ వంటి పథకాలు కోట్లాది మందికి చేరువయ్యాయని కొనియాడారు. సభ అనంతరం చేయూత ఆశ్రమ వ్యవస్థాపకుడు విట్టా శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా 'సేవా జ్యోతి కలశ యాత్ర'ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి, లోకనాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పెద్దిరాజు, కల్పన పాల్గొన్నారు.

## రాహుల్, ప్రియాంక అరెస్టుకు నిరసనగా జాతీయ రహదారిపై కాంగ్రెస్ రాస్తారోకో



**నిజాంపేట్ అక్టోబర్ 7 (జనంసాక్షి):** దేశ రాజధాని ఢిల్లీలో బుధవారం రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ అరెస్టులకు నిరసనగా జంబికుంట వద్ద జాతీయ రహదారిపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు

**ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...** రాహుల్ గాంధీ, ఆయన సోదరి ప్రియాంక గాంధీలను నిర్దాక్షిణ్యంగా లాఠీలతో కొట్టడం, శారీరకంగా దాడి చేయడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పార్టీ భయపడే పార్టీ కాదని, రాహుల్ గాంధీ అరెస్టును బ్లాక్ డే గా పరిగణిస్తున్నామన్నారు. బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు పోరాడుతామని, రేపు దేశవ్యాప్తంగా అన్ని మండలాల్లో రాస్తారోకోలు, ధర్నాలు చేపడతామన్నారు.

ప్రధాని నరేంద్ర మోడీ, అమిత్ షాలకు ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఓటు చోరీకి పాల్పడుతూ లోపాయికారిగా మద్దతు పలుకుతున్నారని, వెంటనే ఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ కోసం ప్రాణ త్యాగానికైనా వెనుకాడబోమని అన్నారు.

ఈ కార్యక్రమానికి జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు హాజరై మాట్లాడుతూ... గత మూడు సంవత్సరాలుగా ఓటు చోరీ జరిగిందని రాహుల్ గాంధీ చెబుతున్నారని, బాధ్యత వహించి ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను అరెస్ట్ చేయాలని, లేనియెడల ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు తమ చివరి రక్తపు బొట్టు వరకు పోరాడుతామని అన్నారు. అనంతరం మోడీ, అమిత్ షా డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు లింగారెడ్డి, మండల ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నిజాయితీని చాటుకున్న సీపీఐ జిల్లా నాయకుడు అశోక్

- దొరికిన ఫోన్‌ను చేర్యాల పోలీసులకు అందజేత



**చేర్యాల, అక్టోబర్ 07 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ఓ గుర్తు తెలియని మొబైల్ ఫోన్ సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్‌కు బుధవారం దొరికింది. అట్టి మొబైల్ ఫోన్‌ను వెంటనే చేర్యాల పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చి ఏఎస్ఐ సదాశివ రావుకు అప్పగించి నిజాయితీని చాటుకున్నారు. మానవత్వంతో నిజాయితీ చాటుకున్న అశోక్ ను చేర్యాల పోలీసులు అభినందించారు. ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తి వివరాలను ఆరా తీయగా వేచరేణి గ్రామానికి చెందిన చామంతుల సుధాకర్‌గా గుర్తించారు. యజమానిని స్టేషన్‌కు పిలిపించి ఫోన్ అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

## పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు దాడి



**సిర్గాపూర్ అక్టోబర్ 7 (జనంసాక్షి):** సిర్గాపూర్ మండలంలోని వాసర్ గ్రామంలో ఒక షాపు వెనుక జూదం ఆడుతున్న వారిని ఎస్ ఐ. మహేష్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి 7,620 నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారికి కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు SI. మహేష్ తెలిపారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

### పీహెచ్‌సీ తనిఖీలో డిప్యూటీ డీఎంహెచ్ఓ సీతారామ రాజు





**కోహీర్, అక్టోబర్ 7 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహీర్ మండల పరిధిలోని బిలాల్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సీతారామ రాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగుల సౌకర్యాలు, సిబ్బంది పనితీరును పరిశీలించారు.

పీహెచ్‌సీలోని ఓపీ సేవలు, ల్యాబొరేటరీ, ఫార్మసీ తదితర విభాగాలకు సంబంధించిన రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించి, రికార్డుల నిర్వహణపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరు, నిర్దేశించిన లక్ష్యాలు, ఇప్పటివరకు సాధించిన ప్రగతిపై సమీక్ష నిర్వహించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొనసాగుతున్న చిన్నపాటి మరమ్మతు పనులను కూడా డిప్యూటీ డీఎంహెచ్ఓ పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.

ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని, పీహెచ్‌సీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సమర్థవంతంగా సాధించేలా సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.

సిబ్బంది నిర్వహిస్తున్న రికార్డులు, ఆరోగ్య కార్యక్రమాల అమలు, వైద్య సేవలపై పలు అంశాలను సమీక్షించిన ఆయన నిరంతరం పర్యవేక్షిస్తూ మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు.

ఈ తనిఖీలో బిలాల్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ దివ్యజ్యోతి, సీహెచ్ఓ రవి కుమార్, మొగులయ్య, ఆరోగ్య విస్తరణ అధికారి నరసింహ, సూపర్‌వైజర్ రాజమణి, ఎల్‌టీ సోనాబాయి, నిరంజన్, విశాల, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్ సేవలను మరింత విస్తరించాలి

- మాజీ మంత్రి డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి
- జిల్లా రెడ్‌క్రాస్ నూతన కార్యవర్గ సభ్యులకు సన్మానం



**వనపర్తి బ్యూరో అక్టోబర్ 7 (జనంసాక్షి):** జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గ సభ్యులను మాజీ మంత్రి డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు పోతుల అమరేందర్, వైస్ చైర్మన్ డాక్టర్ ప్రియాంక, స్టేట్ ఎంసీఎల్ స్వామి, కోశాధికారి విష్ణువర్ధన్, అరవింద్ తదితరులను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి మాట్లాడుతూ.. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఆపదలో ఉన్న వారికి సహాయం చేయడంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఎల్లప్పుడూ ముందుండాలని అన్నారు. రక్తదానం, వైద్య సేవలు, ప్రకృతి విపత్తుల సమయంలో చేపట్టే సహాయక కార్యక్రమాలను మరింత విస్తరించాలని సూచించారు. సేవా కార్యక్రమాల్లో యువతను పెద్దఎత్తున భాగస్వాములను చేయాలని జిల్లా కార్యవర్గ సభ్యులకు సూచించారు. పేదలు, నిరుపేదలు, అవసరంలో ఉన్న వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడిగా పోతుల అమరేందర్ విజయవంతంగా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని జిల్లెల చిన్నారెడ్డి ఆకాంక్షించారు.

# నూతన పెన్షన్ల లబ్ధిదారుల ర్యాండమ్ వెరిఫికేషన్



**తెలకపల్లి, అక్టోబర్ 7 (జనంసాక్షి):** మండలంలో నూతనంగా మంజూరు కానున్న పెన్షన్లకు సంబంధించి ర్యాండమ్ వెరిఫికేషన్ ప్రక్రియను అధికారులు బుధవారం నిర్వహించారు. జిల్లా స్థాయి అధికారి గోపాల్ నాయక్, డిప్యూటీ సీఈఓ ఆధ్వర్యంలో ర్యాండమ్ వెరిఫికేషన్‌కు ఎంపికైన గ్రామ పంచాయతీలను సందర్శించి లబ్ధిదారుల వివరాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు చెందిన 40 మంది లబ్ధిదారులను అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించి, వారి అర్హతలు, సంబంధిత వివరాలను వెరిఫికేషన్ చేశారు.

నూతనంగా పెన్షన్లు మంజూరు చేసే ప్రక్రియలో పారదర్శకత కోసం ఈ ర్యాండమ్ వెరిఫికేషన్ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ పర్యవేక్షకులు శ్రీనివాసులు, సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# గ్రామీణ మౌలిక వసతుల కల్పనే లక్ష్యం: ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి

- నూతన పంచాయతీ భవనాలకు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి శంకుస్థాపన






**ఊర్కొండ, అక్టోబర్ 07 (జనంసాక్షి);** ఊర్కొండ మండలంలో గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి నాలుగు గ్రామాల్లో నూతన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మండలంలోని జకినాలపల్లి, నర్సంపల్లి, గుండ్లగుంటపల్లి, ఇప్పపహాడ్ గ్రామాల్లో నిర్మించనున్న పంచాయతీ భవనాలకు ఆయన భూమిపూజ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన పరిపాలన, ప్రభుత్వ సేవలు సులభంగా అందుబాటులోకి తెచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తోందన్నారు. నూతన భవనాలు అందుబాటులోకి వస్తే ప్రజలకు, పంచాయతీ సిబ్బందికి ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని పేర్కొన్నారు. జడ్చర్ల నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం, ఇటీవల జిల్లా మరియు నియోకవర్గ స్థాయిలో నూతనంగా నియమితులైన యువజన కాంగ్రెస్ నాయకులకు నియామక పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు.

**బాధిత కుటుంబానికి పరామర్శ:**

ఊర్కొండపేట శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి దేవాలయ అటెండర్ మోటపురం ఆంజనేయులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన దశదిన కర్మ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వారి స్వగృహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి మనోధైర్యాన్ని నింపారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ధ్యాప నిఖిల్ రెడ్డి, మండల అధ్యక్షుడు అయూబ్ పాషా, దేవస్థాన చైర్మన్ చింతల మనోహర్ రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

# పోలీస్ ఉద్యోగాల ఉచిత శిక్షణకు దరఖాస్తుకు నేడే చివరి అవకాశం

- ఎస్పీ డాక్టర్ వినీత్



**నారాయణపేట జిల్లా బ్యూరో అక్టోబర్ 7(జనంసాక్షి):** నారాయణపేట జిల్లా నిరుద్యోగ యువతకు పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాల సాధన కోసం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న ఉచిత ప్రత్యేక శిక్షణ కార్యక్ర మానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 8 చివరి తేదీ అని జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్ తెలిపారు. పోలీస్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న బీద, మధ్యతరగతి కుటుంబా లకు చెందిన యువతకు ఉచితంగా నాణ్యమైన శిక్షణ, సరైన మార్గదర్శక త్వం అందించాలనే ఉద్దే శంతో ఈ ప్రత్యేక కార్యక్ర మాన్ని చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. ఈ శిక్షణకు అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఈ నెల 11వ తేదీన చిట్టెం నర్సిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాలలో ఎంట్రన్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఫిజికల్ ఫిట్నె స్, రాత పరీక్ష, మాక్ టెస్టులు, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, పోటీ పరీక్షలపై మార్గదర్శకత్వం తదితర అంశాల్లో ప్రత్యేక శిక్షణ అందించడంతో పాటు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను కూడా అందించనున్నట్లు ఎస్పీ తెలిపారు. ఎంట్రన్స్ పరీక్షకు దరఖాస్తు చేసుకోని నిరుద్యోగ యువ తకు నేటితో చివరి అవ కాశం ఉన్నందున, ఇప్పటి వరకు నమోదు చేసుకోని అర్హులైన యువత వెంటనే క్యూ ఆర్ కోడ్ లేదా గూగుల్ లింక్ ద్వారా తమ వివ రాలను నమోదు చేసుకో వాలని ఎస్పీ సూచించారు. పోలీస్ ఉద్యోగం సాధించాలనే లక్ష్యం ఉన్న ప్రతి యువతి, యువకుడు ఈ ఉచిత శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, నేటి లోపే నమోదు చేసు కోవాలని ఎస్పీ పిలుపు నిచ్చారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా పూర్తి చేయాలి



**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 07(జనంసాక్షి):** మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో ఓటరు జాబితా పరిశీలకులు, రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ సమీక్షా సమావేశం నిర్వహించారు.

**ఈ సందర్భంగా సురేంద్ర మోహన్ మాట్లాడుతూ..** అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించి, అర్హత లేని వారిని తొలగించి పారదర్శక ఓటరు జాబితాను తయారు చేయడమే ఎన్నికల సంఘం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. నియోజక వర్గాల వారీగా నోటీసుల జారీ, హియరింగ్‌లు, డబుల్ ఓటర్ల తొలగింపు ప్రక్రియను సమీక్షించారు. అధికారులు, రాజకీయ పార్టీలు, బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్‌ఏ) సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులోగా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. రెండు చోట్ల ఓటు హక్కు ఉన్నవారికి ఒకే చోట ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లా యంత్రాంగం ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తోందని రాజకీయ పార్టీల ప్రతినిధులు అభినందించారు. అయితే పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ సిబ్బందిని భాగస్వామ్యం చేసి ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.

**కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ..** జిల్లాలో రేషనలైజేషన్ తర్వాత 862 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, అన్నింటికీ బీఎల్‌ఓలను నియమించామని తెలిపారు. ఆగస్టు 17 ముసాయిదా ప్రకారం జిల్లాలో 6,29,402 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. అక్షర దోషాలు, వివరాల్లో తేడాలున్న 2,36,590 మందికి నోటీసులు జారీ చేసి విచారణ జరుపుతున్నామని వివరించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, డీఆర్‌ఓ నిర్మల, ఆర్డీఓ నవీన్, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, ఎన్నికల అధికారులు, పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మినీ ట్యాంక్ బండ్

# అభివృద్ధి పనులు ప్రారంభం







జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ.. శిల్పారామంలో కేటాయించిన స్టాళ్లను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. వారు స్వయంగా తయారుచేసిన ఉత్పత్తులను ఇక్కడ విక్రయించడం ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మేయర్ జి. మమత, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, డిఆర్డిఓ నర్సింహులు, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, కార్పొరేటర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాల ముందు మహనీయుల విగ్రహాలు

- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**జడ్చర్ల, అక్టోబర్ 7 (జనంసాక్షి):** పురపాలక సంఘం పరిధిలో రహదారుల వెడల్పు పనుల సమయంలో తొలగించిన మహనీయుల విగ్రహాలకు స్థానిక శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి సముచిత స్థానం కల్పించే నిర్ణయం తీసుకున్నారు. తొలగించిన విగ్రహాలను గౌరవ ప్రదంగా ఒకే చోట ప్రతిష్ఠించి, ఆ ప్రాంతాన్ని స్మృతి ప్రాంగణంగా తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు. అందుకోసం జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముందున్న ప్రాంగణాన్ని ఎంపిక చేశారు. ఈ మేరకు బుధవారం డిగ్రీ కళాశాల ముందున్న ప్రాంగణాన్ని పరిశీలించి మాట్లాడారు. జాతీయ నేతల విగ్రహాలతో పాటు సీనియర్ నాయకుడు, ప్రజా సేవకుడు స్వర్గీయ ఎర్ర సత్యం విగ్రహాన్ని కూడా ఇదే ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఎర్ర సత్యం ప్రజల కోసం నిస్వార్థంగా సేవలందించారని, ఆయన బ్రతికి ఉంటే ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగేవారని ఎమ్మెల్యే కొనియాడారు. ఆయన సేవలను స్మరించుకుంటూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. విగ్రహాలు మహనీయుల త్యాగాలకు, ఆశయాలకు నిదర్శనాలని, వీటి ఏర్పాటు వల్ల భవిష్యత్ తరాలకు వారి స్ఫూర్తి అందుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ నిర్ణయం పట్ల జడ్చర్ల ప్రజలు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.